ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 319 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | ఆదివారం 15 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

Circulated by: Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

## ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించాల్సిన బకాయి రూ. 1.77 లక్షల కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి భారత ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించా ల్సిన సర్దుబాటు చేసిన స్థూల రాబడి(ఏజీఆర్) బకాయిలు రూ. 1.77 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ఈ మేరకు అధికారి క డేటా వివరాలను ప్రభుత్వం పార్లమెంటుకు

## వాణిజ్య ఒప్పంద ప్రభావం పడొచ్చు

మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై వెలువడిన భారత్-అమెరికా సంయుక్త ప్రకటన ప్రభావం ఈవారం మన స్టాక్ మార్కెట్లపై ఉంటుంది. మన వస్తువులపై అమెరికా టారిఫ్‌లు 50% నుంచి 18 శాతానికి తగ్గుతాయి. సముద్ర ఉత్పత్తులు, జౌళి, ఇతర కార్మిక ఆధారిత రంగాలకు ప్రయోజనం కలగనుంది. సాంకేతికంగా చూస్తే నిఫ్టీ-50కి 25,500 పాయింట్ల వద్ద మద్దతు, 25,750 వద్ద నిరోధం కనిపించొచ్చు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు కోబ్రా కమాండోల దుర్మరణం
- ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు కోబ్రా కమాండోల మృతి చెందారు
- ధమ్తరి జిల్లాలో ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టిన కమాండోల కారు
- ఈ ఘటనలో మరో కమాండోకు తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం



## భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో రూ.40 కోట్ల విలువైన హెరాయిన్ జారవిడిచిన డ్రోన్

- శుక్రవారం రాత్రి అనుమానిత డ్రోన్ కదలికలను గుర్తించిన స్థానికులు
- డ్రోన్ ఏదో పదార్థాన్ని జారవిడిచినట్లు గుర్తించిన స్థానికులు
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు



## ఈశాన్యంలో చారిత్రక ఘట్టం

- తొలి 'ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ'
- హైవేపై దిగిన మోదీ విమానం
- ఈశాన్య భారతంలో తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ హైవే ప్రారంభం
- ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై సీ130 జే విమానంలో దిగిన ప్రధాని
- చైనా సరిహద్దుల్లో కీలకంగా మారనున్న ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ






## కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుంది

- హస్తం పార్టీపై మోదీ విమర్శలు
- అస్సాంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- విపక్ష కాంగ్రెస్ పార్టీపై ప్రధాని ఫైర్
- కాంగ్రెస్ పాలనలో అస్సాం భయం గుప్పిట్లో ఉండేదని ఎద్దేవా
- 'కాంగ్రెస్ హయాంలోనే 2జీ, 3జీ టెక్నాలజీ- అలాగే 2జీ స్కామ్ కూడా'

## ది ట్రైలర్ మాత్రమే..

- అసలు సినిమా ముందుంది
- బీఆర్ఎస్ పార్టీకి కవిత హెచ్చరిక
- తాము రాజకీయ పార్టీగా మారబోతున్నట్లు తెలియగానే బీఆర్ఎస్ ట్రోలింగ్ చేసిందని ఆగ్రహం
- బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికైనా తప్పులను సరిదిద్దుకోవాలని కవిత సూచన
- వద్దేపల్లిలో ఏఐఎఫ్‌బీ, తెలంగాణ జాగృతి కలిసి విజయం సాధించిందన్న కవిత



హైదరాబాద్

తమ సంస్థ రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించగానే బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు తమను ట్రోలింగ్ చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిప డ్డారు. కానీ తమను లక్ష్యంగా చేసుకున్న వారికి ఒకటే విషయం చెబుతున్నానని, ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని హెచ్చరించారు. ఇప్పుడే తొందరపడి మాట జారవద్దని, తమపై కారుకూతలు - మిగతా3లో

## హంగ్ మున్సిపాలిటీలపై నజర్



- మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ!
- మంత్రులు, కాంగ్రెస్ సీనియర్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- మంత్రులతో జూబ్లీహిల్స్ క్యాంపుకార్యాలయంలో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి
- కార్పొరేషన్లు, మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలపై చర్చ
- మేయర్, ఛైర్మన్ పీఠాల కైవసానికి కార్యాచరణపై నేతలకు దిశా నిర్దేశం
- సీఎం హంగ్ మున్సిపాలిటీల విషయములో వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలి
- సాధ్యమైనన్ని మున్సిపాలిటీలలో అధికారం నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది
- స్వతంత్రుల మద్దతుతో సుమారు 20 వరకు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసే అవకాశాలున్నాయి

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో స్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారనున్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ క్రమం లోనే జూబ్లీహిల్స్‌లోని మల్కాజిగిరి క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు.. తదుపరి కార్యాచరణపై చర్చించనున్నారు. ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై చర్చ జరగనుంది. వీటిలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేలా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలు 'హస్త'గతం అవుతాయని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఈ సమావేశానికి పలువురు సీనియర్ నేతలూ హాజరయ్యారు. తెలంగాణ మున్సిపల్, కార్పొరేషన్ల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఈ క్రమంలోనే మంత్రులు, సీనియర్ నేతలతో జూబ్లీహిల్స్‌లోని - మిగతా3లో



## ఉగ్రదాడులకు కాంగ్రెస్ జవాబివ్వలేదు

- మోదీ ప్రభుత్వం వాళ్ల ఇంటికెళ్లి కొట్టింది: అమిత్ షా
- కాంగ్రెస్ పాలనలో ఉగ్రదాడులకు సరైన సమాధానం దొరకలేదు
- మోదీ ప్రభుత్వం హయాంలో సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెప్పారు- అమిత్ షా కీలక వ్యాఖ్యలు

## ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం

- ఐఏఎస్ అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం అనుమతి
- ఫార్ములా ఈ- కార్ రేస్ కేసులో కీలక పరిణామం
- ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం అనుమతి
- కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గతంలోనే గవర్నర్ అనుమతి
- కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గతంలోనే గవర్నర్ అనుమతిచ్చిన విషయం తెలిసిందే.



హైదరాబాద్

ఫార్ములా ఈ-కార్ రేస్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి లభించింది. ప్రాసిక్యూష న్‌కు అనుమతిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రాసిక్యూషన్ విషయంపై రాష్ట్రానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. ఫార్ములా ఈ కార్ రేసుపై ఇప్పటికే విచారణ జరుపుతున్న ఏసీబీ.. మరో వైపు ఇప్పటికే కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇచ్చారు. ఈ కేసులో రాజకీయ, అధికారులపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి రావడంతో.. ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు ఏసీబీ సిద్ధమైంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై - మిగతా3లో

# దెబ్బతీసిన రెబెల్స్

- బరిలోకి దిగి సత్తా చాటిన స్వతంత్ర అభ్యర్థులు
- ప్రధాన పార్టీల అభ్యర్థుల విజయావకాశాలను దెబ్బతీసిన రెబెల్స్
- జగిత్యాలలో మొత్తం 9 మంది కాంగ్రెస్ రెబెల్స్ విజయం
- పలు చోట్ల రెబెల్స్ కారణంగా నష్టపోయిన అధికార పార్టీ



హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో పలు చోట్ల రెబెల్స్ సత్తా చాటారు. తమకు వార్డు సభ్యుడిగా పోటీ చేసేందుకు సీటు కావాల్సిందేనని కొందరు పట్టుబ ట్టారు. ప్రధాన పార్టీలు ససేమిరా అనడంతో వారు తమ బాధ్యతలను వదులుకుని స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలా పోటీ చేసిన అభ్యర్థులుగా బరిలోకి దిగారు. కొన్నిచోట్ల బీజేపీ మూల్యం చెల్లించుకోక తప్పలేదు. జగిత్యాలలో మొత్తం 9 మంది కాంగ్రెస్ రెబెల్స్ విజయం పతాకం ఎగురవేశారు. వారందరు ఎవరా అని ఆరాతీయగా మంత్రి జీవన్‌రెడ్డి అనుచరులే కావడం గమనార్హం. అక్కడ బీజేపీ రెబెల్స్ మరో ముగ్గురు విజయఢంకా మోగించారు. సూర్యాపేట మున్సిపాలిటీలో 6 మంది, కోదాడలో ముగ్గురు, హుజూరాబాద్‌లో ఇద్దరు, కామారెడ్డిలో ముగ్గురు కాంగ్రెస్ రెబెల్స్ సత్తా చాటారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో 10వ వార్డులో బీఆర్ఎస్ రెబెల్ అభ్యర్థి - మిగతా3లో




## అమెరికా ఒప్పందంపై ప్రధాని, మంత్రులు భ్రమలు కల్పిస్తున్నారు

- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై మరోసారి రాహుల్ విమర్శలు
- వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆరోపణ
- ప్రధాని, ఆయన మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని విమర్శ
- ఎక్స్‌లో వీడియో విడుదల చేసిన రాహుల్


## సంపాదకీయం

# ప్రజారోగ్యంపై ఎందుకింత నిర్లక్ష్యం?

దేశంలో చుట్టుముడుతున్న ఆరోగ్య సంక్షోభం కేంద్ర పాలకుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. ఎందుకంటే, ఏ ప్రభుత్వానికైనా ప్రజల ఆరోగ్యమే మౌలిక బాధ్యత. కానీ, ఆ బాధ్యతనుంచి రోజురోజుకూ తప్పించుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. తాజా కేంద్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే, ఆరోగ్యం పేరుతో ప్రజల నుంచి భారీగా పన్నులు వసూలు చేస్తూనే, అదే స్థాయిలో ఆ రంగానికి నిధులు కేటాయిం చడంలో వెనుకంజ వేసింది. ముఖ్యంగా "హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్సు" పేరుతో వసూలు చేస్తున్న మొత్తం, ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి తగిన విధంగా వినియోగించబడటం లేదన్న విమర్శలకు తాజా గణాంకాలే నిదర్శనం. ప్రస్తుతం ఆదాయపన్ను, కార్పొరేట్ పన్నులపై నాలుగు శాతం హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్సును కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తోంది. 2023-24లో ఈ సెస్సు ద్వారా సుమారు ఒక లక్షా పద్దెనిమిది వేల కోట్ల రూపాయలు వసూలయ్యాయి. 2024-25లో ఇది లక్షా ఇరవై ఐదు వేల కోట్ల రూపాయలకు పైగా పెరిగింది. 2026 బడ్జెట్ అంచనాల ప్రకారం ఈ ఆదాయం లక్షా ముప్పై వేల కోట్ల రూపాయలను దాటే అవకాశం ఉంది. అంటే ప్రజలు ప్రతి సంవత్సరం లక్ష కోట్లకు పైగా మొత్తాన్ని ప్రత్యేకంగా "ఆరోగ్యం" పేరుతో చెల్లిస్తున్నారు. అయితే ఇదే బడ్జెట్‌లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు కేటాయించిన మొత్తం సుమారు తొంభై రెండు వేల కోట్ల రూపాయలకే పరిమితమైంది. ఆరోగ్యసెస్సు ద్వారా వసూలు చేస్తున్న మొత్తంతో పోలిస్తే ముప్పై నుంచి నలభై వేల కోట్ల రూపాయలు తక్కువగా ఆరోగ్య రంగానికి నేరుగా కేటాయిస్తున్నారు. ఇది కేవలం లెక్కల తేడా కాదు, ఆరోగ్యం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఎంత వెనుకబడి ఉందో చెప్పే స్పష్టమైన సూచిక. కేంద్రం, రాష్ట్రాలు కలిపి ప్రభుత్వ ఆరోగ్య వ్యయం దేశ జీడీపీలో ఇంకా రెండు శాతంలోపే ఉంది. జాతీయ ఆరోగ్య విధానం-2017 ప్రకారం 2025 నాటికి ఈ వ్యయాన్ని జీడీపీలో రెండున్నర శాతానికి పెంచాలని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, తాజా బడ్జెట్ తర్వాత కూడా ఆ లక్ష్యం నెరవేరలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఐదు శాతం లక్ష్యంతో పోలిస్తే భారత్ చాలా వెనుకబడి ఉంది. ప్రభుత్వ ఆరోగ్య వ్యయం తక్కువగా ఉండటంతో దాని ప్రభావం నేరుగా ప్రజలపై పడుతోంది. ప్రస్తుతం దేశంలో మొత్తం ఆరోగ్య ఖర్చుల్లో వ్యక్తిగత జేబు ఖర్చు సుమారు నలభై ఏడు శాతం వరకు ఉంది. అధికారిక ఆరోగ్య ఖాతాల ప్రకారం ప్రతి సంవత్సరం ఆరు నుంచి ఏడు కోట్ల మంది వైద్య ఖర్చుల కారణంగా పేదరికంలోకి జారిపోతున్నారు. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో కీలకమైన భాగమైన ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్ల పరిస్థితి కూడా ఆందోళన కలిగించేదే. కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నప్పటికీ, వాటికి తగిన నిధులు, అధ్యాపకులు, పరికరాలు సమకూరడం లేదు. అనేక కాలేజీల్లో బోధనా సిబ్బంది కొరత, ల్యాబ్‌లు, లైబ్రరీలు, హాస్టళ్ల లోపం స్పష్టంగా కనిపిస్తోంది. టీచింగ్ హాస్పిటళ్లలో పడకలు, ఐసీయూ సదుపాయాలు, ఆధునిక పరికరాల కొరత వల్ల రోగుల సంరక్షణతో పాటు వైద్య విద్య నాణ్యత కూడా దెబ్బతింటోంది. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులపై రోగుల భారం రోజురోజుకీ పెరుగుతోంది. కానీ, ఆ భారం మోయడానికి అవసరమైన బడ్జెట్, మానవ వనరులు అందుబాటులో లేవు. ఫలితంగా విద్యార్థులు సరైన క్లినికల్ అనుభవం పొందలేకపోతున్నారు, అధ్యాపకులు బోధనకంటే సేవల భారంతో అలసిపోతున్నారు. ఇది భవిష్యత్తు వైద్యుల తయారీపైనే ప్రభావం చూపుతోంది. ఇంత జరుగుతున్నా, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్సు ద్వారా వచ్చిన నిధులు చట్టపరంగా ప్రత్యేక ఆరోగ్యనిధిగా కేటాయించబడటం లేదు. ఈ మొత్తం కేంద్ర సమగ్రనిధిలో కలిసిపోతుంది. అంటే ఆరోగ్య పేరుతో వసూలు చేసిన డబ్బులో ఎంత భాగం నిజంగా ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, ప్రజారోగ్య కార్యక్రమాలకు ఖర్చయిందో ప్రజలకు స్పష్టమైన సమాచారం లేదు. ఈ పారదర్శకత లోపమే అసలు సమస్య. దేశంలో నాన్-కమ్యూనికబుల్ వ్యాధులు మొత్తం మరణాల్లో అరవై శాతం కంటే ఎక్కువకు కారణమవుతున్నాయి. మానసిక ఆరోగ్య సమస్యలు, వృద్ధుల ఆరోగ్య అవసరాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజారోగ్య వ్యవస్థను, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను బలోపేతం చేయడం తప్పనిసరి. కానీ, తాజా బడ్జెట్‌లో ఆ దిశగా అవసరమైన పెట్టుబడి కనిపించడం లేదు. ప్రజల నుంచి ఆరోగ్యం పేరుతో ఏడాదికి లక్షల కోట్ల రూపాయలు వసూలు చేస్తూనే, అదే ఆరోగ్య రంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం పాలనా వైఫల్యమే తప్ప వేరేకాదు. హెల్త్ సెస్సు పెరుగుతున్నప్పుడు ఆరోగ్య వ్యయమూ అదే స్థాయిలో పెరగాలి. కానీ, ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఆరోగ్యం వెనుకబడినట్టే కనిపిస్తోంది. ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వం మోయాల్సిన చోట, అది నెమ్మదిగా ప్రజల జేబుల పైకి మళ్లుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. హెల్త్ సెస్సును ప్రత్యేక ఆరోగ్య నిధిగా మార్చి, ప్రతి రూపాయి ఎలా ఖర్చవుతుందో ప్రజలకు చెప్పే పారదర్శక వ్యవస్థ కావాలి. అది లేకపోతే, ఈ సెస్సు ప్రజల ఆరోగ్యానికి కాదు, బడ్జెట్ లెక్కలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. ప్రజల ప్రాణాల మీద వసూలు చేసే పన్నుకు ఇది తగిన న్యాయం కాదు.

# నేటి తరానికి ఆదర్శం ధర్మబిక్షం సేవాభావం

ఆయన స్వాతంత్ర్య సమర యోధులు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు. నిజాం వ్యతిరేక ఉద్యమ కారులు. నిబద్ధత కలిగిన రాజకీయ నాయకులు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా ప్రజా మద్దతుతో ఎన్నికై, అత్యంత సామాన్య జీవితం గడిపిన అసామాన్య నాయకులు. ఆయనే బొమ్మగాని ధర్మబిక్షం. బొమ్మ గాని ధర్మబిక్షం యువకుడిగా విద్యార్థి నాయకులు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు. ఆర్య సమాజ్ బాధ్యులు. ప్రజా జీవితమే పరమావధిగా ఆజన్మ బ్రహ్మచారిగా గడిపిన ఆదర్శ నాయకులు. సామా జిక సేవకునిగా, గ్రామీణ పేదల హక్కుల కోసం పోరాటం, యువత, విద్యార్థులు అసంఘటిత కార్మికుల సంఘటితం, పేదలకోసం భూమి, ఇళ్ళ కొనుగోలు లాంటి కార్యక్రమా లలో అకుంఠిత కార్యదీక్ష, అంకిత భావంతో నిరంతరం అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆయన నల్లగొండ జిల్లాలోని మునుగోడు మండలం, ఊకొండి గ్రామంలో బొమ్మగాని ముత్తి లింగయ్య గౌడ్, పద్మ దంపతులకు 1922 ఫిబ్రవరి 15లో జన్మించారు. బొమ్మ గాని ధర్మబిక్షం తండ్రి చిన్నవయస్సులో సూర్యాపేటకు వచ్చి స్థిరపడ్డారు. ధర్మభిక్షం సూర్యాపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే జాతీయ భావాలు అలవరుచు కున్నారు. నిజాం పట్టాభిషేక రజతోత్సవాల సందర్భంగా పాఠశాలలో ఉత్స వాలు జరపాలన్న ప్రధానోపాధ్యా యుడి ఆదేశాలను వ్యతిరేకించి తోటి విద్యార్థులతో కలిసి బహిష్క రించారు. సామాజిక రుగ్మతలపై పోరాడటం కోసం తన సహ విద్యార్థులకు శిక్షణనివ్వటానికి విరాళాలు సేకరించి ఒక వసతి గృహం ఏర్పాటు చేశారు. సోవియట్ సోషలిస్ట్ విప్లవం, భారత దేశంలో జరిగిన అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు నల్గొండ జిల్లాలో మొదటి కమ్యూనిస్ట్ సెల్‌ను స్థాపించడానికి ధర్మభిక్షంను ప్రేరేపించాయి. అలా 1942లో సీపీఐలో చేరి, కమ్యూనిస్టు పార్టీతో అనుబంధాన్ని ఏర్పరచుకుని, ధర్మభిక్షం పార్టీలో పనిచేస్తూనే పాత్రికేయులుగా తెలంగాణలోని



నాటి ప్రముఖ పత్రికలైన మీజాన్, రయ్యత్, గోల్కొండల్లో పనిచేశారు. నిజాంపై సాయుధ పోరాటం మొదలైన తర్వాత తుపాకి చేత బట్టి యుద్ధరంగంలోకి దిగారు. సాయుధ పోరాటాన్ని విస్తరింప జేశారు. దేశ్‌ముఖ్ వ్యతిరేక పోరాటంలో భాగంగా పేరుమోసిన భూస్వామి విస్నూరు రామచంద్రా రెడ్డికి వ్యతిరేకంగా ధర్మభిక్షం విద్యా సంస్థల్లో నిరవధిక సమ్మెను నిర్వహించి, ఏడాదిన్నర పాటు అజ్ఞాత జీవితం గడిపారు. తర్వాత అరెస్టు కాబడి ఐదేళ్లకు పైగా జైలుశిక్షను అనుభవించారు. సూర్యా పేటలో, చంచల్ గూడ సెంట్రల్ జైలు, ఔరంగాబాద్, జాల్నా జైళ్లలో గడిపారు. స్వాతంత్ర్యం అనంతరం 1952లో తొలిసారిగా హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు సూర్యాపేట నియోజక వర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభకు 1957లో నకిరేకల్ నుండి, 1962లో నల్గొండ నుండి ప్రాతినిధ్యం వహించారు. 1991లో, 1996లోనూ ఆయన ఎంపీగా నల్గొండ లోకసభ నియోజక వర్గం నుండి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. 1996 లో 11వ లోక్‌సభ ఎన్నికలలో నల్లగొండ నుండి 480 మంది ఫ్లోరైడ్ బాధితులు పోటీ చేసినప్పటికి ఆయన 76 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి గౌడ కులస్తుల హక్కుల కోసం ఆయన చివరి వరకు పోరాడారు. తెలంగాణ ప్రాంతంలో శ్రమ జీవులను సమైక్య పర్చడంలో, పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం పాత్ర మారవ లేనిది. పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం ప్రధాన పాత్ర వహించి 'కార్మిక పక్షపాతి'గా గుర్తింపు తెచ్చు కున్నారు. ధర్మభిక్షం తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, హిందీ భాషల్లో మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. 1951-73లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) జిల్లా మండలి, నల్గొండ కార్యదర్శిగా, 1952-57, 1957-62, 1962-67 ఆంధ్రప్రదేశ్ శాసనసభ శాసన సభ్యులుగా, 1972 నుండి ఆంధ్రప్రదేశ్ సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1991లో 10వ లోక్ సభ సభ్యులుగా, 1991-96 సంప్రదింపుల కమిటీ, గ్రామీణాభివృద్ధి శాఖ సభ్యులుగా. 1992-95 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి, సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1996 లో 11వ లోక్ సభ సభ్యులుగా, భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ), జాతీయ మండలి సభ్యులుగా పనిచేసిన విశేష అనుభవం గడించారు. నిజాం హయాంలో రైతాంగ ఉద్యమంలో పాల్గొని, భారత ప్రభుత్వం నుంచి తామ్రపత్ర పురస్కారం అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ లో 2019 నవంబర్ 8న రోజున బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ధర్మబిక్షం నీతి, నిజాయితీకి ఆదర్శనీ యుడని ఆయన జీవిత చరిత్రను పాఠ్యాం శంలో చేర్చాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆ సందర్భం గా అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. జీవితాంతం ప్రజా సేవకే అంకితమై, సోదరుని కుమారున్ని దత్తత తీసుకుని, అవివాహితులుగానే ఉన్నారు. 89 ఏళ్ళ వయసులో ఇంట్లో జారి పడటంతో ఆయన తుంటి ఎముకకు దెబ్బ తగలగా, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసు పత్రిలో ఫిబ్రవరి 11న శస్త్రచికిత్స జరిపించుకొని, తర్వాత ఊపిరి తిత్తుల సమస్యతో చికిత్స పొందుతూ 2011, మార్చి 26న మరణించారు. పోరాట యోధుని గా, అసామాన్య ప్రజా సేవకునిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారు.

# తెలుగునేలపై శైవమత వ్యాప్తి

చారిత్రక యుగమున శాతవాహన, చాళుక్య, రాష్ట్రకూట, కాకతీయ, అనంతర కాలమున హైందవ సంస్కృతీ సభ్యతల కు ఆలవాలమైన తెలుగు నేలలో వివిధ రాజన్యుల ఏలుబడులలో శైవమతం పరిడవిల్లింది. క్రీ.పూ. 2వ శతాబ్ది నాటికే తెలుగు నేలలో శైవారాధన ఉంది. గాథా సప్తశతిలో గౌరీ, పశుపతి స్తోత్రముంది. 1వ శతాబ్దంలో శైవంలో అత్యంత ప్రాచీనమైన పాశుపత శైవాన్ని లకులీస శివాచార్యుడు స్థాపించారు. చేతికందుతున్న చరిత్ర ఆధారంగా శ్రీముకుడు కాణ్వ రాజైన సుశర్మను వధించి, మగధను ఆక్రమించి, శాతవాహన రాజ్యాన్ని స్థాపించాడని, వివిధ చరిత్రకారుల అభిప్రాయాన్ని అనుసరించి, శ్రీ.పూ. 1వ శతాబ్దిగా స్పష్టమవుతున్నది. శ్రీముకుడు జైన మతాన్ని స్వీకరించి, అనేక ఆలయాలను నిర్మించాడు. శాతవాహన 17వ రాజైన హాల చక్రవర్తి, సింహళ రాకుమారి లీలావతిని సప్త గోదావరీ తీరస్థ భీమేశ్వరాలయం, నేటి జగిత్యాల జిల్లాలోని వేంపెల్లి వెంకటరావుపేటలో వివాహ మాడినట్టు నాటి భీమేశ్వరాలయం ఉన్నట్లు నిరూపితమైంది. బౌద్ధమతంలోనూ నాగదేవత అరాధన ఉంది. స్థూపాలను పెనవేసుకున్న నాగ సర్పాల చిత్రాలు ప్రధానంగా ధూళికట్ట స్థూపంపై ఐదుతలల నాగ ముచిలింద శిల్పాన్ని చూడవచ్చు. ఇక్ష్వాకు (క్రీ.శ. 253, 277) రాజైన ఎహువల శాంతమూలుని సేనానియైన ఎలిశ్రీ ఏలేశ్వరం నిర్మించి, సర్వదేవాలయమనే శివాలయాన్ని నిర్మించాడు. ఆయన కాలంలో విజయపురిలో కార్తికేయ, పుష్పభద్ర స్వామి, నోడిగిరీశ్వర, దేవీ ఆలయాలు నిర్మితాలై నాయి. ఇక్ష్వాకుల కాలంలో మాతృ దేవతారాధన కూడా ఉండేది. నాగార్జున కొండలో హరీతి ఆలయం నిర్మించ బడింది. ఆలయంలో సప్తమాతృకల వద్ద గాజులను సమర్పించే వారని శాసనాధారం. వీరికాలంలో స్కంద గణపతి, యక్షుడు, హరీతి దేవత లను పూజించేవారు. అనంతర వాకాట రాజులలో అధికులు శైవులు. మొదటి రుద్ర సేనుడు మహా భైరవుని భక్తుడు కాగా, మొదటి పృధ్వీసేనుడు మహేశ్వర భక్తుడు. క్రీ.శ. 358నుండి 569వరకు 210 ఏళ్ళ తెలంగాణను, ఉత్తరాంధ్రను పాలించిన విష్ణుకుండినులు నేటి మహబూబ్ నగర్ జిల్లాలోని అమ్రాబాద్ (అమల పురం), నల్గొండ జిల్లాలోని వలిగొండ మండలం లోని ఇంద్రపాల నగరం. కొంతకాలం బెజవాడను రాజధానిని చేసుకున్నారు. వీరు బ్రాహ్మణ మతావ లంబులు, శివభక్తులు. రెండవ మాధవవర్మ (క్రీ.శ. 440-495) 100కుపైగా యుద్ధాలు చేసి, విజయాలు సాధించి, ఒక్కొక్క విజయానికి గుర్తుగా కీసర గుట్టపైన ఒక లింగ ప్రతిష్ఠ చేశాడు. విజయం సాధించిన చోటల్లా రామలింగేశ్వర ఆలయం కట్టించాడు. శ్రీశైలం మల్లికార్జుననికి చంద్రగుప్తుడు అనే రాజు బంధువైన చంద్రవతి ప్రతి ష్ఠించినదని చెపుతున్న గుప్త మహేశ్వర ఆలయ శిథిలాలు, నేటికీ శ్రీశైల ఉత్తర ద్వార క్షేత్రమైన ఉమా మహేశ్వరానికి ఉత్తరాన ప్రతాప రుద్ర కోటకింద వాయవ్య మూలన రోడుకు దక్షిణాన ఉన్నాయి. శ్రీశైల మల్లికార్జునుడు విష్ణుకుండినుల కాలంలోనే బహుళ ప్రచారం పొందాడు. గోవింద వర్మ అనేక దేవాలయాలు కట్టించాడు. 2వ మాధవ వర్మ అనేక రామ లింగేశ్వరాలయాలు కట్టించాడు. గుంటూరు జిల్లా లోని సత్తెనపల్లి తాలూకా వేల్పూరులో, ఈ ఊరులో, కీసరగుట్టలో రామలింగే శ్వరాలయాలు నేటికీ దర్శనీయ స్థలాలే. తూర్పు చాళుక్య 2వ విజయాదిత్యుడు 108 విజయాలకు గుర్తుగా 108 భీమేశ్వరాలయాలు నిర్మించాడు. జైన మతం విష్ణుకుండినుల కాలంలోనే దాదాపు కనుమరుగు కాగా, జైన ఆలయాలు శివాలయాలైనాయి. అలంపురం విష్ణుకుండినుల కన్నా ముందువారైన ఇక్ష్వాకుల నుంచే మనుగడలో ఉండేదని శాసనాధా రంగా ఉంది. వేములవాడ చాళుక్యులు, వేములవాడలో నిర్మించిన రాజరాజేశ్వరాలయం తెలంగాణ లోని ప్రముఖ శివాలయం. బద్దెగ (క్రీ.శ. 850-895) వేములవాడలో బద్దిగేశ్వర (భీమేశ్వర) ఆలయాన్ని నిర్మించాడు. క్రీ.శ. 7వ శతాబ్ది శాసనంలో శివమండల దీక్ష ప్రసక్తి ఉంది. శ్రీశైలం, అలంపురం, బెజ వాడ, పిఠాపురం నాటి శక్తి పూజా కేంద్రాలు. బసవేశ్వరుడు (క్రీ. 1100-70) వీర శైవోద్యమాన్ని ప్రారంభించాడు. అనంతరం మల్లికార్జున పండితుడు శైవాన్ని ప్రచారం చేశాడు. చాళుక్య భీముడు ద్రాక్షారామంలో భీమేశ్వరాలయం నిర్మించాడు. భీమవరం, పాలకొల్లు, అమరావతి ఆలయాలు చాళుక్య నిర్మాణాలే. యుద్ధ మల్లుడు బెజవాడలో కుమారస్వామి, 2వ విక్రమాదిత్యుని భార్య మహాదేవి, పట్టడకల్ లో శైవాలయాన్ని నిర్మించారు. రాష్ట్రకూటుల కాలంలో ఎల్లోరా గుహలు మలుచ బడ్డాయి. కైలాసనాథ ఏక శిలాలయం మొదటి కృష్ణుని అద్భుత సృష్టి. కాలాముఖి, కాపాలిక తెగలు ప్రచారం లోకి వచ్చాయి. కాకతీయులు కాకతి మాతృదేవతారాధకులుగా అభిప్రాయాలున్నాయి. గ్రామదేవత యైన ఏకవీర ఆరాధన నాడు బహుళ ప్రచారంలో ఉంది. వీరికాలంలో జైన బౌద్ధ, వీరశైవుల మధ్య ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇందుకు భిన్నంగానే తిక్కన హరిహర తత్వాన్ని బోధించాడు. కాళేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేసింది 2వ ప్రోలరాజు గురువైన రామేశ్వర పండితుడు. కాకతీయ పరిపాలనలో ధర్మపురి, అనుమకొండ, ఐనవోలు, పానగల్లు, నందికంది, శనిగరం, పుష్పగిరి, అమరావతి, సామర్లకోట, భీమ వరం, పాలకొల్లు, ద్రాక్షారామం గొప్ప శైవక్షేత్రాలు. ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో కాకతీయుల కాలంలో 5500 శైవాలయాలు, 1300 వైష్ణవాల యాలు, 2400 మల్లారదేవుని గుళ్ళ...భైరవ, దుర్గ గణపతి దేవుళ్ళవి కలిపి 4400 గుడులు ఉండేవని స్పష్టమవు తున్నది. వెలమరాజుల కాలంలో కాళిక, దుర్గ, చండి, భద్రకాళి, మహిశాసుర మర్ధిని, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతల ఆరాధన ఉన్నట్లు తెలుస్తున్నది.

# అలుపెరుగని పోరాట యోధుడు

నరెడ్ల శ్రీనివాస్ అంటే తెలియక పోవచ్చు కాని, లోక్ సత్తా శ్రీనివాస్ అనగానే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమే. చాలా మంది ఆయనను లోక్ సత్తా శ్రీనివాస్ అనే పిలిచేవారు. సామాజిక న్యాయం, ఉద్యమాలకు ఆయన కేర్ ఆఫ్ అడ్రస్ గా నిలిచారు. ఉత్తర తెలంగాణలో గత ఆనాలుగు దశాబ్దాలుగా కొనసాగిన సామాజిక ఉద్యమాలతో ఆయన భాగస్వామ్యం లేని ఉద్యమమే లేదంటే అతిశయోక్తి కాదు. లోక్ సత్తా ఉద్యమ సంస్థతో గత పాతికేళ్లుగా ఆయనకు విడదీయరాని సంబంధం ఉంది. లోక్ సత్తా అంటే శ్రీనివాస్. శ్రీనివాస్ అంటే లోక్‌సత్తా అని పేరెన్నికగన్నారు. అవినీతి, అన్యాయాలు అక్రమాలపై నిరంతరమైన పోరాటాలు చేశారు. ఎన్నో విజయాలు సాధించారు. కరీంనగర్‌లో ఉన్న అన్ని ఉద్యమ వేదికలు ఆయనవే. గత సామాజిక ఉద్యమాలతో ఆయనకు విడదీయరాని బంధం సంబంధం అనుబంధం ఉన్నాయి. ఆయన ప్రతి ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. వాస్తవానికి ఉద్యమాలను నిర్మించారంటే సమంజసంగా ఉంటుంది. ఉద్యమాల నిర్వహణలో అలుపెరగక, ఏనాడూ రాజీపడక, మొక్కవోని ధైర్యంతో, చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో, అకుంఠిత కార్యదీక్షతో, అంకితభావంతో, అన్నింటినీ మించి చిత్తశుద్ధితో, ఉద్యమాలలో మమేకమైన పోరాటయోధుడు. 1955లో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామంలో నిరుపేద కుటుంబంలో నరెడ్ల శ్రీనివాస్ జన్మించిన శ్రీనివాస్... యూనియన్ బ్యాంకులో ఉద్యోగం చేస్తూ, బ్యాంకు మేనేజర్ గా ప్రమోషన్ మీద కొంత కాలంగా రాష్ట్రం విడిచి వెళ్ళిన సందర్భంలోనూ, ఏనాడూ ఉద్యమ కార్యాచరణను ఆయన వదిలిపెట్టలేదు. వినియోగదారుల మండలి తరపున వందలాది కేసులు వేసి హక్కులను పరిరక్షిం చేందుకు కృషి చేశారు. అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించడంలో కృషి చేసిన వారిని సన్మానించి ప్రోత్స హించేవారు. పాలకుల తప్పులను, ప్రభుత్వ పాలసీల్లోని లోపాలను ఎత్తిచూపడంలో, ప్రజా సమస్యలతో పాటు, సామాన్య బాధితుల న్యాయం కోసం పోరాడ డంలో ఆయన వ్యక్తిత్వం అనన్య సామాన్యం. ఉమ్మడి రాష్ట్ర వినియోగ దారుల మండలి అధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో అందరికీ అందు బాటులో ఉండేలా కిరాయి ఇల్లు వేదికగా, కరీంనగర్ వినియోగ దారుల మండలి నిర్వాహక బాధ్యునిగా, వేలాది కేసులను ఆయన పరిష్కరించారు. అన్యా యానికి గురైన వారు తమకు న్యాయం తప్పక జరుగుతుందని నమ్మకంతో, లోక్ సత్తా ఆఫీసును వెతుక్కుంటూ వచ్చేవారు. వారి సమస్య పరిష్కారం అయ్యే దాకా సలహాలు సూచనలు అందించ డమే కాక, వెంట ఉండి సహకరించే వారు. హుజురాబాదులో జన్మించిన 69ఏళ్ళ శ్రీనివాస్.. విద్యార్థి జీవితంలోనే ప్రగతిశీల భావాలు కలిగి, ఆనాటి పోరాట, విప్లవ యోధుల సాహచర్యంతో ఎదిగారు. 1970వ దశక ప్రారంభంలో మిత్రులతో కలిసి హుజురాబాద్‌లో సాహితీ సంస్థ స్థాపనకు చొరవ చూపి, మహాకవి శ్రీశ్రీని ఆహ్వానించి, హుజురాబాద్ లో సమావేశాలు నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారు. కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్ కాలేజీలో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ పూర్తి చేసి, కరీంనగర్ యూనియన్ బ్యాంక్ లో ఉద్యోగంలో చేరారు. ప్రగతి శీల, భావజాల పరిధిని విస్తృత పరుచుకుని, తన లాంటి భావాలున్న వారితో జత కట్టారు. ఒకనాడు జర్నలిస్టులకు వేదికగా, ఎందరో జర్నలిస్టులను తయారు చేసి, జర్నలిస్టుల తయారీ కర్మాగా రంగా విలసిల్లిన, విజయ కుమార్ సంపాదకత్వంలో వెలువరించిన 'జీవగడ్డ పత్రికలో వారం వారం 'పెన్నుపోటు' పేర కాలమిస్టు గా పని చేశారు. ఆకాలంలో జీవగడ్డలో పని చేసిన అల్లంనారాయణ, ఘంటా చక్రపాణి, ఆనాడు జిల్లాలో విధులు నిర్వర్తించిన సీనియర్ జర్నలిస్టు మిత్రులు దేవులపల్లి అమర్, దామెర్ల సాయిబాబా, ఎస్. కే.జకీర్ తదితరులతో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నారు.

# కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుంది

కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనేవారిని, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేయాలని నినాదాలు చేసేవారిని హస్తం పార్టీ సమర్థిస్తుందని విమర్శించారు. దేశాన్ని విభజించాలనుకుంవారే కాంగ్రెస్ ఆరాధకులుగా మారుతారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ముస్లిం లీగ్ దేశాన్ని విభజించిందని, ఇప్పుడు నేటి కాంగ్రెస్ 'ముస్లిం లీగ్ మావోయిస్టు కాంగ్రెస్'గా మారిందని దుయ్యబట్టారు. అందుకే కాంగ్రెస్ పట్ల అసోం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసోం ఆకలితో అలమటించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. అలాగే భయం గుప్పిట్లో ఉందన్నారు. అభివృద్ధి కోసం నిధులు ఇవ్వకుండా తప్పించుకునే హస్తం పార్టీ అసోంను అభివృద్ధి చేయగలదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కేంద్రం నుంచి అసోం పన్ను వాటాగా రూ.10,000 కోట్లు మాత్రమే అందుకునేదన్నారు. ఇప్పుడు బీజేపీ సర్కార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కన్నా 5 రెట్లు ఎక్కువను పన్ను వాటాగా అందుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విస్మరించిన ఈశాన్య ప్రాంతాలకు తాము భక్తితో సేవ చేస్తున్నామని పేర్కొన్నారు.

అసోం వృద్ధి ప్రయాణం చాయ్ నుంచి చిప్స్ వరకు : మోదీ

"కాంగ్రెస్ అసంతృప్తికి అతిపెద్ద కారణం ఓటు బ్యాంకు రాజకీయాలే. హస్తం పార్టీ ఎప్పుడూ అసోంను ఎన్నికల కోణంలోనే చూసింది. ఆ పార్టీ హయాంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అసోంకు చేరడానికి సంవత్సరాల కాలం పట్టింది. కానీ బీజేపీ ఎల్లప్పుడూ అసోం, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూనే ఉంది. కొంతకాలం క్రితం దేశంలో మొట్టమొదటి స్లీపర్ వందే భారత్ రైలు అసోం నుంచే ప్రారంభమైంది. సెమీకండక్టర్ రంగంలో అసోం వృద్ధి ఇంజిన్‌గా మారుతోంది. ఇక్కడ తయారయ్యే చిప్‌ల గురించి అసోం టీ లాగా ప్రపంచవ్యాప్తంగా చర్చించుకునే రోజు ఎంతో దూరంలో లేదు. ఆ రాష్ట్ర వృద్ధి ప్రయాణాన్ని చాయ్



నుంచి చిప్స్ వరకు చూడవచ్చు."

**'కాంగ్రెస్ హయాంలోనే 2జీ, 3జీ టెక్నాలజీ- అలాగే 2జీ స్కామ్ కూడా'**

కాంగ్రెస్ హయాంలో 3జీ, 4జీ టెక్నాలజీ వచ్చిందని, అలాగే 2+ స్కామ్ కూడా వచ్చిందని మోదీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో ఎయిమ్స్‌ల గురించి పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో అసోంలో హింస, వేర్పాటువాదం ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలో ఎన్‌డీఏ సర్కార్ శాంతి, శ్రేయస్సు, వేగవంతమైన అభివృద్ధి అనే సంకల్పంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఒకప్పుడు బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన అసోంలో ఇప్పుడు శాంతి నెలకొందన్నారు.

"అలాగే అధికారంలో లేకపోవడం వల్ల కాంగ్రెస్ మరింత విషపూరితంగా మారింది. కింది స్థాయి నుంచి అగ్ర నాయకుల వరకు అందరూ విషం చిమ్ముతున్నారు. అసోంను మళ్లీ అశాంతి, గందరగోళంలోకి నెట్టాలని హస్తం పార్టీ ప్రయత్నిస్తోంది. రాష్ట్రాన్ని చొరబాటుదారులకు అప్పగించాలని కోరుకుంటోంది. కాంగ్రెస్ నాయకులందరూ చొరబాటుదారులను కాపాడటానికి ప్రయత్నిస్తున్నారు. అసోం నిజమైన గుర్తింపును తుడిచిపెట్టాలని కోరుకుంటున్నారు. "

**ఈశాన్య ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తున్నాం!**

కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఈశాన్య ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందని మోదీ మండిపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తుందని అన్నారు. అసోంలో మౌలిక సదుపాయాల పెంపుదలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాంగ్రెస్ భారత్‌ను ఒక దేశంగా పరిగణించడానికి కూడా నిరాకరిస్తుందని, భారతమాత పట్ల కనీస గౌరవం కూడా చూపదని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తగా ఉండటం తన జీవితంలోని గొప్ప గౌరవం అన్నారు.

రాబోయే ఐదేళ్లు అసోంకు కీలకం : ప్రధాని మోదీ

"2014 నాటికి దేశంలో కేవలం 6 ఎయిమ్స్‌లు మాత్రమే ఉన్నాయి. ఆ ఏడాదే దేశానికి సేవ చేసే అవకాశాన్ని ప్రజలు నాకు ఇచ్చారు. ఆ తర్వాత కాలంలో ఎయిమ్స్‌ల సంఖ్య భారీగా పెరిగింది. బీజేపీ సర్కార్ గువాహటిలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేసింది. నిన్ననే 'పీఎం-రాహత్' పథకానికి ఆమోదం తెలిపాం. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా, ఎవరైనా ప్రమాదంలో గాయపడితే కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్సను అందిస్తుంది. గత 11 ఏళ్లలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం అసోంకు కేంద్ర ప్రభుత్వం రూ.5.5 లక్షల కోట్లకు పైగా నిధులను కేటాయించింది. ఈశాన్య ప్రాంతాల కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాం. కనెక్టివిటీ పెరిగే కొద్దీ ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇటీవల గువాహటిలో పరీక్ష పే చర్చ కార్యక్రమం జరిగింది. బ్రహ్మపుత్ర నదిపై క్రూయిజ్‌లో విద్యార్థులతో నేను చర్చించాను. రాబోయే ఐదేళ్లు అసోంకు చాలా కీలకం." అని మోదీ పేర్కొన్నారు.

అసోం అభివృద్ధిలో, ప్రజల జీవితాల్లో బ్రహ్మపుత్ర నదిది ప్రముఖ పాత్ర అని మోదీ పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ 70 ఏళ్ల పాలనలో బ్రహ్మపుత్ర నదిని దాటడం ఎల్లప్పుడూ పెద్ద సవాలుగా ఉండదేదని ఆరోపించారు. దాదాపు 7 దశాబ్దాల పాలనలో ఆ పార్టీ బ్రహ్మపుత్ర నదిపై కేవలం 3 వంతెనలను మాత్రమే నిర్మించాయన్నారు. గత 10-11 ఏళ్లలో బీజేపీ సర్కార్ బ్రహ్మపుత్ర నదిపై ఐదు పెద్ద వంతెనలను పూర్తి చేసిందని తెలిపారు. కాంగ్రెస్ అసోంకు సమస్యలను మాత్రమే ఇచ్చిందని, బీజేపీ మాత్రం వాటికి పరిష్కారాలను చూపిందన్నారు.

# ఉగ్రదాడులకు కాంగ్రెస్ జవాబివ్వలేదు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలనలో ఉగ్రదాడులకు సరైన సమాధానం దొరకలేదని, మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెప్పిందని వ్యాఖ్యానించారు. 2019 ఫిబ్రవరి 14 జరిగిన పుల్వామా ఉగ్రదాడిని ఉటంకిస్తూ, ప్రతీకారం తీర్చుకునే కొత్త సంప్రదాయానికి మోదీ శ్రీకారం చుట్టారని షా పేర్కొన్నారు. యూపీఏ పాలనలో పాకిస్థాన్ ఉగ్రవాదులు, భారత సైనికులపై తీవ్ర స్థాయిలో దాడులు జరిపారని ఆరోపించారు. కానీ మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మన సైనికులు, శత్రువుల భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాదులను అంతమొందించారని చెప్పారు. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని కారైకల్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో అమిత్ షా ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు నివాళులర్పించారు. "పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళులు అర్పిస్తున్నాను. కాంగ్రెస్ పాలనలో, పాకిస్థాన్ ఉగ్రవాదులు ప్రతిరోజూ మన సైనికులపై దాడి చేసేవారు. దీనిపై దేశ ప్రధానమంత్రి, హోంమంత్రి లేదా రక్షణ మంత్రి నుంచి ఎటువంటి స్పందన ఉండేది కాదు. కానీ పుల్వామా దాడికి ప్రతీకారంగా మోదీ ప్రభుత్వం వైమానిక దాడులు చేసింది. పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించి, ఉగ్రవాద స్థావరాలను మట్టికరిపించింది. ప్రధాని మోదీ హయాంలో మొదట సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు గట్టి సమాధానం



ఇచ్చింది"

**మీ ముందు రావడానికి రెండు కారణాలు ఉన్నాయి: అమిత్ షా**

మరోవైపు, పుదుచ్చేరిలోని బీజేపీ బహిరంగ సభలో పాల్గొన్న అమిత్ షా ఆ ప్రాంత అభివృద్ధి గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ముందుకు రావడానికి రెండు లక్ష్యాలు ఉన్నాయని షా పేర్కొన్నారు. అందులో మొదటిది మోదీ, రంగ స్వామి నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ సాధించిన విజయాలను ప్రజల ముందు ఉంచడానికని, రెండోది అవినీతి శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖూూ - ×చీణ× కూటమిల ముసుగును బయటపెట్టడానికని షా వ్యాఖ్యానించారు.

"ఐదు సంవత్సరాల క్రితం, పుదుచ్చేరి ప్రజలు ప్రధాని మోదీ, రంగస్వామి నాయకత్వంలో ఇక్కడ ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. భారత్‌ను సుసంపన్నంగా, సురక్షితంగా మార్చడానికి ప్రధాని మోదీ కృషి చేశారు. పుదుచ్చేరి ప్రజలు ఎన్‌డీఏ, బీజేపీ, రంగస్వామి, ప్రధాని మోదీపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో, పుదుచ్చేరి ప్రజలు 44% ఓట్లను గెలుచుకుంది. కానీ ఈసారి బీజేపీ, ఎఐఎన్‌ఆర్‌సీ, ఎఐఏడీఎంకే కూటమి 60% ఓట్లతో సీట్లను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే పుదుచ్చేరిలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధానంగా మూడు పనులు చేసింది. అందులో మొదటిది అవినీతిని అంతం చేయడం, రెండోది పుదుచ్చేరిని స్వయంప్రతిపత్తి కలిగిన కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం, మూడోది పుదుచ్చేరికి రాజకీయ స్థిరత్వాన్ని తీసుకురావడం వంటి పనులు చేసింది." అని అమిత్ షా పేర్కొన్నారు.

**జవాన్ల ప్రాణ త్యాగాలను భారత్ ఎన్నటికీ మరచిపోదు!**

ఇదిలా ఉండగా, 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ జవాన్లపై జరిగిన ఉగ్రదాడిని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. జవాన్ల ప్రాణ త్యాగాన్ని భారత్ ఎన్నటికీ మరిచిపోదన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టే మన భద్రతా దళాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువని, దానిని పూర్తిగా నిర్మూలించేందుకు భారత్ కట్టుబడి ఉందని మోదీ పేర్కొన్నారు.

# అమెరికా ఒప్పందంపై ప్రధాని, మంత్రులు భ్రమలు కల్పిస్తున్నారు

అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రధాని, ఆయన కేబినెట్ మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని ఆయన ఎక్స్‌లో దుయ్యబట్టారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు.

"భారత్‌లోని టెక్స్‌టైల్ రంగం 5 కోట్ల కుటుంబాలకు ఉపాధినిస్తోంది. నరేంద్ర మోదీ అమెరికాతో చేసుకున్న ఒప్పందం భారత టెక్స్‌టైల్ రంగాన్ని అంతం చేస్తుంది. ఈ విషయం నరేంద్ర మోదీకి, మొత్తం భారతదేశానికి తెలుసు. అదే నేను పార్లమెంటులో చెప్పాను. బంగ్లాదేశ్‌కు 0% పన్ను, భారత్‌కు 18% పన్ను విధిస్తున్నారు. అందువల్ల భారత టెక్స్‌టైల్ పరిశ్రమను బంగ్లాదేశ్ టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతీస్తుంది. మనకు కూడా ఆ రాయితీ కావాలంటే అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకోవాలని కేంద్రమంత్రి ఒకరు చెప్పారు. కానీ అసలు నిజం ఏమిటంటే మన పత్తి బంగ్లాదేశ్‌కు వెళ్తుంది. మన పత్తి ద్వారానే భారత్‌లో టెక్స్‌టైల్ మిల్లులు నడుస్తున్నాయి. ఒకవేళ మనం బంగ్లాదేశ్ లాగా అమెరికా పత్తిపై ఆధారపడితే మన దేశంలో పత్తి రైతులు, వస్త్ర పరిశ్రమ నాశనమైపోతాయి. ఒకవేళ మనం అమెరికా పత్తిని దిగుమతి చేసుకోకపోతే మన టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతింటుంది. ఇదే అసలు నిజం. పీయూష్ గోయల్ అబద్ధాలు చెప్పవద్దు. అందుకే 'సరెండర్' అంటున్నాను. ఎందుకంటే ఈ ఒప్పందం వల్ల పత్తి రైతు నష్టపోతాడు.




**మోదీ ప్రభుత్వం పత్తి, వస్త్ర రంగాలకు నష్టం కలిగించింది!**

ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్ గాంధీ విమర్శించారు.

**భారత్- అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం!**

గత వారం భారత్-అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందంలో యూఎస్ పారిశ్రామిక వస్తువులు, విస్తృత శ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తొలగించడం లేదా తగ్గించడం వంటివి ఆ ఒప్పందంలో ఉన్నాయి. వీటిలో పశుగ్రాసం కోసం ఎర్ర జొన్న, చెట్ల గింజలు, తాజా ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్, అదనపు ఉత్పత్తులు ఉన్నాయి. ప్రతిగా, యునైటెడ్ స్టేట్స్ వస్త్రాలు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు, సేంద్రీయ రసాయనాలు, గృహాలంకరణ, చేతివృత్తుల ఉత్పత్తులు వంటి ఎంపిక చేసిన భారతీయ వస్తువులపై 18 శాతం సుంకాలను వర్తింపజేయనుంది. అయితే ఒప్పందం పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాత, జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, వజ్రాలు, విమాన భాగాలు వంటి వస్తువులపై అమెరికా విధించిన సుంకాలు తొలగిపోనున్నాయి.

## ఈశాన్యంలో చారిత్రక ఘట్టం




ఈశాన్య రాష్ట్రం అసోం చారిత్రక ఘట్టానికి సాక్షిగా నిలిచింది. అసోంలో ఏర్పాటు చేసిన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీని శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. దిబ్రూగఢ్‌లోని మొరాన్ బైపాస్ వద్ద తీర్చిదిద్దిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై సీ130జే విమానంలో మోదీ ల్యాండయ్యారు. తొలుత చబువా ఎయిర్‌ఫీల్డ్‌కు చేరుకున్న ప్రధాని మోదీ అక్కడ సీ 130 జే విమానం ఎక్కి మొరాన్ బైపాస్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిలో దిగారు. అదే ఈఎల్ఎఫ్‌పై ఆధునిక యుద్ధ విమానాలైన రఫేల్, సుఖోయ్-30, హెలికాప్టర్ల విన్యాసాలను ఆయన తిలకించారు. దాదాపు 40 నిమిషాలు పాటు ఈ విన్యాసాలు జరిగాయి. అంతకుముందే ఈ ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ గురించి ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఈఎల్ఎఫ్ కీలకమని పేర్కొన్నారు.

**ఈఎల్ఎఫ్ ప్రత్యేకత ఇదే**

చైనా సరిహద్దులకు సమీపంలో దేశ రక్షణకు ఈ ఈఎల్ఎఫ్ కీలకం కానుంది. 4.2 కిలోమీటర్ల పొడవైన ఈ హైవే కోసం దాదాపు 100 కోట్లు ఖర్చు చేశారు. అత్యవసర సమయాల్లో సైనిక, పౌర విమానాల ల్యాండింగ్, టేకాఫ్ కోసం భారత వైమానిక దళం(ఐఏఎఫ్) సమన్వయంతో ఈ ఈఎల్ఎఫ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు. దీని వల్ల సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు జరిగినప్పుడు భారత వాయుసేన వేగంగా స్పందించేందుకు అవకాశం ఉంటుంది. 40 టన్నుల వరకు యుద్ధ విమానాలను, 74 టన్నుల గరిష్ఠ టేకాఫ్ బరువు గల రవాణా విమానాలను నిర్వహించగలదు. టేకాఫ్, ల్యాండింగ్‌కు అనుకూలంగా దీనిని రూపొందించారు. ఇప్పటికే పశ్చిమ, ఉత్తర, మధ్య భారత్‌లో ఈ ఈఎల్ఎఫ్‌లు ఉన్నాయి. రూ. 5,450 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇవి ఈశాన్య ప్రాంతంలో కనెక్టివిటీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఉన్న విద్య వంటి అంశాలను బలోపేతం చేసే లక్ష్యంగా ఉన్నాయి. శనివారం మధ్యహ్నం బ్రహ్మపుత్ర నదిపై వంతెనను, ఈశాన్య ప్రాంతానికి డేటా సెంటర్ సహా అసోంలోని పలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించనున్నారు. బ్రహ్మపుత్రపై దాదాపు రూ.3,030 కోట్ల వ్యయంతో నిర్మించిన కుమార్ భాస్కర్ వర్మ సేతును ప్రధాని ప్రారంభిస్తారు. 2019 ఫిబ్రవరి 9న ఈ వంతెనకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. అలాగే పీఎం-ఈబస్సు సేవా కింద 225 ఎలక్ట్రిక్ బస్సులను కూడా ప్రారంభించనున్నారు.

**మోదీ మణిపుర్ వెళ్లాలని టికెట్ బుక్ చేసిన కాంగ్రెస్**

మరోవైపు ప్రధాని మోదీ అసోం పర్యటనపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ఉద్రికత్తలు జరుగుతున్న మణిపుర్‌లో కాకుంకడా మోదీ అసోం పర్యటించడాన్ని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా విమర్శించారు. అసోం నుంచి మణిపుర్‌కు కేవలం గంటలో వెళ్లొచ్చని అన్నారు. మణిపుర్‌కు వెళ్లాలని, ప్రధాని హామీ ఇస్తే ప్రజలు నిర్భయంగా ఉంటారని తెలిపారు. తాము ప్రధానికి విమానం టికెట్ కూడా బుక్ చేశామని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. '2023 నుంచి మణిపుర్‌లో అల్లర్లు జరుగుతూనే ఉన్నాయి. ఆదివారం జరిగిన దాడులతో ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. మీరు ఈ రోజు అసోంలోనే ఉన్నారు. మణిపుర్ వెళ్లడానికి వీలుగా గువాహటి విమానాశ్రయం నుంచి ఇంఫాల్‌కు విమానం టికెట్ బుక్ చేశాం. మీ ఫోన్ నంబర్ నా దగ్గర లేకపోవడం వల్ల విమాన టికెట్‌ను సోషల్ మీడియా షేర్ చేస్తున్నా. దయచేసి దానిని ఉపయోగించుకుని మణిపుర్ వెళ్లండి' అని పవన్ ఖేడా టికెట్‌ను పోస్ట్ చేశారు. దీనిపై బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారు.

## భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో రూ.40 కోట్ల విలువైన హెరాయిన్ జారవిడిచిన డ్రోన్

భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లోని ఆర్ఎస్ పురా సెక్టార్ ప్రాంతంలో రూ.40 కోట్లకు పైగా విలువైన 6.5 కిలోల హెరాయిన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ వీటిని జారవిడిచినట్లు అనుమానిస్తున్నారు. శుక్రవారం రాత్రి అనుమానిత డ్రోన్ కదలికలను స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ డ్రోన్ ఏదో పదార్థాన్ని జారవిడిచినట్లు స్థానికులు వారికి తెలిపారు. దీంతో పోలీసులు బీఎస్ఎఫ్ దళాలతో కలిసి ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. స్థానిక పొలాల్లో పెద్ద ఎత్తున హెరాయిన్‌ను గుర్తించారు. దాని మొత్తం విలువ రూ.40 కోట్లకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, కథువా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా పాక్ నుంచి హెరాయిన్‌ను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు చెందిన జతిన్, కథువాలోని జఖ్‌బార్‌కు చెందిన డానిష్ డోగ్రాలుగా గుర్తించారు. వీరికి పాకిస్థాన్ స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 201వ కోబ్రా బెటాలియన్‌కు చెందిన నలుగురు కమాండోలు ప్రాణాలు కోల్పోయారు. మరో కమాండో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ధమ్తరి జిల్లాలోని ఖప్రి బైపాస్‌పై శనివారం ఆగి ఉన్న ఒక ట్రక్కును కోబ్రా కమాండోలు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. నక్సలిజంపై పోరాటంలో అంకితభావంతో పనిచేస్తున్న కమాండోలు మరణించడంపై రాష్ట్రవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. అర్జుని పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కమాండోలు జగదల్‌పూర్ నుంచి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు ఆగి ఉన్న ట్రక్కును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం ట్రక్కు కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని, గ్యాస్ కట్టర్ల సహాయంతో కారులో చిక్కుకున్న వారిని బయటకు తీశాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు కమాండోలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచారు. తీవ్రంగా గాయపడిన మరో కమాండోను ధమ్తరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి 'ఎక్స్' వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "కోబ్రా బెటాలియన్ వీర జవాన్లు అకాల మరణం చెందారన్న వార్త హృదయ విదారకంగా ఉంది. దేశ సేవలో అంకితమైన ఆ అమర జవాన్లకు నా వినమ్ర నివాళులు" అని పేర్కొన్నారు. రాష్ట్ర హోంమంత్రి విజయ్ శర్మ కూడా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రాథమికంగా అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నప్పటికీ, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆపరేషన్ల కోసం సీఆర్‌పీఎఫ్ కింద పనిచేసే ప్రత్యేక దళమే కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రెజల్యూట్ యాక్షన్).

# ఖమ్మం... గుమ్మంలో టీడీపీ లెక్క

**ఖమ్మం :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు. స్థానికంగా బలం ఉన్నచోట సొంతంగానే ఆ పార్టీ నేతలు బరిలో దిగారు. అనూహ్యంగా ఖమ్మం జిల్లా మధిరలో టిడిపి అభ్యర్థి విజయం సాధించడం విశేషం. అయితే స్థానికంగా నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో అక్కడ టిడిపి అభ్యర్థికి ప్రజలు పట్టం కట్టారు. అది డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గం. అటువంటి చోట టిడిపి అభ్యర్థి గెలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కానీ అక్కడ కాంగ్రెస్ మద్దతుతో టిడిపి గెలుపొందిందని కామెంట్స్ వినిపిస్తున్నాయి. వాస్తవానికి తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి అధికారికంగా పోటీ చేయలేదు. ఫలితాల ప్రకటనలో మాత్రం టిడిపి అభ్యర్థి విజయం సాధించారని తెలియడం తో ఉత్కంఠ నెలకొంది. ఖమ్మం జిల్లాలో టిడిపి హవా ఇంకా కొనసాగుతోందని స్పష్టమైంది. వాస్తవానికి తెలంగాణలో గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఖమ్మం జిల్లాలోనే టిడిపికి బలం ఉండేది. 2014లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు చోట్ల టిడిపి విజయం సాధించింది. అప్పట్లో మెజారిటీ స్థానాలు గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఖమ్మం జిల్లాలోనే వచ్చాయి..ఖమ్మం జిల్లాలో 2014 ఎన్నికల్లో సైతం మెజారిటీ సీట్లను కైవసం చేసుకుంది తెలుగుదేశం పార్టీ. కానీ 2018 ఎన్నికలకు వచ్చేసరికి మాత్రం సీన్ మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అసలు పోటీ చేయలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు చంద్రబాబు ఎన్నో రకాల ప్రయత్నాలు చేశారు. కాసాని జ్ఞానేశ్వర్ కు నాయకత్వ బాధ్యతలు కట్టబెట్టారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల సమరానికి శంఖం పూరించేందుకు ఖమ్మం జిల్లాను ఎంచుకున్నారు. ఆ జిల్లాలో తెలుగుదేశం పార్టీ భారీ సమావేశం కూడా నిర్వహించింది. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏపీలో చంద్రబాబు అరెస్టయ్యారు. ఆ సమయంలో ఎన్నికలకు వెళ్లడం అంటే సాహసంతో కూడిన పని. అందుకే చంద్రబాబు ఆ ఎన్నికలను



బహిష్కరించారు.2024 లో ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో తెలంగాణలో సైతం తెలుగుదేశం పార్టీ యాక్టివ్ అవుతుందని అంతా భావించారు. కానీ ఎందుకో చంద్రబాబు పెద్దగా ఆసక్తి చూపలేదు. టిడిపి తెలంగాణ అధ్యక్ష పదవి కూడా భర్తీ చేయలేదు. అయితే దీని వెనుక వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ తెలంగాణ సెంటిమెంట్ పోయి.. కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపి పుంజుకోవాలని.. గులాబీ పార్టీ బలహీన పడిన తర్వాతే టిడిపిని యాక్టివ్ చేస్తారని ఒక విశ్లేషణ ఉంది. అయితే మున్సిపల్ ఎన్నికల్లో కనీసం అధికారికంగా పోటీ చేయలేదు టిడిపి. కానీ ఖమ్మం జిల్లా మధిరలో మాత్రం ఒక వార్డు స్థానాన్ని కైవసం చేసుకుంది. ఖమ్మం జిల్లాలో టిడిపి సంస్థగతంగా బలంగా ఉండడానికి కారణం అక్కడ కమ్మ సామాజిక వర్గ ప్రాబల్యం అధికం. మొన్నటి ఎన్నికల్లో కమ్మ సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీకి మద్దతు దారుగా నిలిచింది. మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో సైతం ఓ 15 సీట్లలో టిడిపి విజయం సాధించింది. ఇప్పుడు అధికారికంగా పోటీలో లేకుండానే మధిరలో టిడిపి అభ్యర్థి గెలవడం విశేషం.

# ఎక్స్ అఫిషియో పైనే అందరి గురి

**హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. ఇక పురపాలికల్లో ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు.. నగరపాలికల్లో మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ఎక్స్ అఫీషియో సభ్యులు, వాళ్ల ఓట్లు బాగా వార్తల్లోకి ఎక్కాయి. ఈ క్రమంలోనే అసలు ఈ ఎక్స్ అఫీషియో సభ్యులు అంటే ఎవరు. వాళ్ల ఓట్లు మున్సిపల్ ఎన్నికల్లో ఎందుకు అంత కీలకం. వాళ్లు వేసే ఓట్ల వల్ల ఎవరికి ఉపయోగం అనే పూర్తి విషయాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెల్లడి అయ్యాయి. అత్యధిక వార్డుల్లో గెలిచిన అధికార హస్తం పార్టీ.. ఎక్కువ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను హస్త గతం చేసుకుంది. ఎన్నికల ఫలితాలు వెలువడటంతో.. ఇప్పుడు మున్సిపాలిటీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎన్నుకునేందుకు ఎన్నికలు జరగనున్నాయి. అదే సమయంలో కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆ మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో అత్యధిక సీట్లు పొందిన పార్టీ.. ఛైర్మన్, వైస్ ఛైర్మన్.. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను దక్కించుకోనుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు చాలా మున్సిపాలిటీలు, కొన్ని కార్పొరేషన్లలో ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. ఈ హంగ్ మున్సిపాలిటీ, హంగ్ కార్పొరేషన్‌లలో ఎక్స్ అఫీషియో ఓట్లు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఛైర్మన్, వైస్ ఛైర్మన్.. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల సమయంలో ఈ ఎక్స్ అఫీషియో ఓట్లు నిర్ణయాత్మకంగా ఉంటాయి. రెండు పార్టీలకు సమానంగా వార్డులు వస్తే.. అప్పుడు ఎక్స్ అఫీషియో సభ్యులు ఎవరికి ఓటు వేస్తారో ఆ కుర్చీ వారికే దక్కుతుంది.ఎక్స్ అఫీషియో అనేది లాటిన్ భాష నుంచి వచ్చిన పదం. దీనికి 'పదవీ హోదా కారణంగా' అని అర్థం. అంటే ఒక వ్యక్తికి ప్రస్తుతం ఉన్న పదవి కారణంగా మరో సంస్థలో సభ్యుడిగా గుర్తింపు ఉండటం. పురపాలికలు, నగరపాలికల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు వంటి ప్రజాప్రతినిధులు వారి హోదా కారణంగా ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. అయితే వారు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి గెలవకపోయినా.. వారికి ఉన్న పదవి కారణంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సమావేశాల్లో పాల్గొనే హక్కును కలిగి ఉంటారు. అదే



సమయంలో మేయర్, ఛైర్మన్ ఎన్నికల్లో కొన్నిసార్లు ఓటు వేసే అవకాశం కూడా ఉంటుంది.ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో ఏదో ఒకచోట మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంటుంది. అదే ఎమ్మెల్సీలు, రాజ్యసభ ఎంపీలు అయితే మాత్రం రాష్ట్రంలోని ఏ మున్సిపాలిటీలో అయినా ఒకదాన్ని సెలెక్ట్ చేసుకుని అక్కడ ఓటు వేయాల్సి ఉంటుంది. అయితే ఈ ఎక్స్ అఫీషియో ఓటు వేయాలంటే దానికి ఒక విధానం ఉంటుంది. మున్సిపాలిటీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలకు ముందు (ఈ మున్సిపల్ ఎన్నికలకు ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు) ఆయా మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.మున్సిపల్ కమిషనర్‌కు అప్లై చేసుకున్న తర్వాత మాత్రమే ఆ ఎమ్మెల్యే, లోక్‌సభ ఎంపీ, ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎంపీకి ఓటు హక్కు అమల్లోకి వస్తుంది. అయితే ఆ సమయంలోగా దరఖాస్తు చేసుకోకపోతే వారు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నప్పటికీ.. ఓటు హక్కు మాత్రం వినియోగించుకోలేరు. మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికైన వార్డు సభ్యులు.. ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకునే సమయంలో రెండు పార్టీలకు సమానంగా ఓట్లు వస్తే.. అప్పుడు ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటు కీలకంగా మారుతుందిఒక మున్సిపాలిటీలో మొత్తం 30 వార్డులు ఉంటే.. అందులో రెండు పార్టీలకు చెరో 15 సీట్లు వస్తే.. ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకునే సమయంలో టై అవుతుంది. అలాంటి సమయంలోనే ఈ ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎవరి వైపు ఓటు వేస్తే ఆ పార్టీ బలం 16కు పెరుగుతుంది. దీంతో మున్సిపల్ ఛైర్మన్ పదవి ఆ పార్టీకే దక్కుతుంది. అందుకే రెండు పార్టీలకు మున్సిపాలిటీలో సమానంగా బలం ఉన్నపుడు ఈ ఎక్స్ అఫీషియో సభ్యుడు కింగ్ మేకర్ అవుతారు. అందుకే పురపాలికల్లో ఎక్స్ అఫీషియో ఓటు చాలా కీలక పాత్రను పోషిస్తుంది.

# కార్పొరేషన్లలలో కారుకు పంక్చర్

**హైదరాబాద్ :** తెలంగాణ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ పార్టీకి గట్టి షాక్‌లా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఏడు కార్పొరేషన్ల ఎన్నికల్లో గులాబీ పార్టీ కనీసం ఉనికిని కూడా చాటుకోలేక, అన్ని చోట్లా మూడో స్థానానికి పరిమితమైంది. పట్టణ ఓటర్లు ఈసారి బీఆర్ఎస్ అగ్రనేతల కంచుకోటలను సైతం బద్దలు కొడుతూ అధికార కాంగ్రెస్ , బీజేపీల వైపు స్పష్టంగా మొగ్గు చూపారు. ఈ ఫలితాలు పార్టీ నాయకత్వానికి శరాఘాతంగా మారాయి. మున్సిపల్ కార్పొరేషన్లలో అత్యధికంగా నల్గొండ లో కాంగ్రెస్ తన విజయకేతనం ఎగురవేసింది. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థులు కనీసం రెండో స్థానంలో కూడా నిలవలేకపోయారు. అటు రామగుండం కార్పొరేషన్‌లో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం సాధించగా, బీఆర్ఎస్ సింగిల్ డిజిట్ స్థానాలకే పరిమితమైంది. ప్రజలు అభివృద్ధి వైపు మొగ్గు చూపుతూ అధికార పార్టీకి భారీ మెజారిటీని కట్టబెట్టారు.కరీంనగర్ కార్పొరేషన్ లో కూడా బీఆర్ఎస్‌కు పరాభవం తప్పలేదు. కరీంనగర్, నిజామాబాద్‌లలో బీజేపీ మేయర్ పీఠాల దిశగా దూసుకుపోతుండగా, కాంగ్రెస్ గట్టి పోటీని ఇచ్చింది. కానీ, ఒకప్పుడు ఈ రెండు కార్పొరేషన్లను



శాసించిన బీఆర్ఎస్ మాత్రం కేవలం నామమాత్రపు సీట్లకే పరిమితమైంది. ఇక్కడ బీజేపీ-కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోరు సాగింది. కొత్తగూడెం కార్పొరేషన్ లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. ఇక్కడ కాంగ్రెస్, సీపీఐ పార్టీలు సమాన స్థానాల్లో నిలిచాయి. అయితే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీపీఐకి అన్‌కండిషనల్ ఆఫర్ ఇచ్చింది. అయితే రాష్ట్ర స్థాయిలో పొత్తు ఉన్నందున సీపీఐ మాత్రం కాంగ్రెస్‌తో కలిసి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. మహబూబ్‌నగర్, మంచిర్యాల కార్పొరేషన్లలో కూడా కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది.అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, పలు కార్పొరేషన్ డివిజన్లలో స్వతంత్ర అభ్యర్థుల ఓట్ల కంటే బీఆర్ఎస్ అభ్యర్థులకు తక్కువ ఓట్లు వచ్చాయి. ఇది పార్టీ క్షేత్రస్థాయిలో ఎంతగా బలహీనపడిందో తెలియజేస్తోంది. కేవలం సిరిసిల్ల, సిద్దిపేట వంటి కొన్ని మున్సిపాలిటీలకు మాత్రమే బీఆర్ఎస్ పరిమితం కాగా, కార్పొరేషన్ల స్థాయిలో మాత్రం ఘోరంగా విఫలమైంది. ప్రస్తుత ట్రెండ్స్ ప్రకారం మొత్తం ఏడు కార్పొరేషన్లలో నల్గొండ, మహబూబ్‌నగర్, మంచిర్యాల, రామగుండం కాంగ్రెస్ వశం కాగా.. నిజామాబాద్, కరీంనగర్‌లలో బీజేపీ మేయర్లు కొలువుదీరే అవకాశం ఉంది. కొత్తగూడెంలో కాంగ్రెస్-సీపీఐ కూటమి అధికారంలోకి రానుంది. ఈ ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ ప్రభ తగ్గుతోందనడానికి సంకేతమని భావిస్తున్నారు.

## హంగ్ మున్సిపాలిటీలపై నజర్..

-మొదటిపేజీ తరువాయి

క్యాంపు ఆఫీస్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేషన్లు, పురపాలక సంఘాల ఫలితాలపై చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఆశించిన ఫలితాలు రావడంతో సంతృప్తిని వ్యక్తం చేసిన సీఎం హంగ్ మున్సిపాలిటీల విషయములో వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని సూచించారు. నిన్నటి ఫలితాల్లో 38 మున్సిపాలిటీల్లో హంగ్ వచ్చింది. వీటిలో సాధ్యమైనన్ని మున్సిపాలిటీలలో అధికారం నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. స్వతంత్రుల మద్దతుతో సుమారు 20 వరకు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసే అవకాశాలున్నాయని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఆ దిశగా తీసుకోవాల్సిన వ్యూహంపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. అలాగే మేయర్, ఛైర్మన్ ఎంపిక కార్యచరణపై కూడా ఆయన నేతలకు ఆదేశాలు జారీచేశారు. ఎక్స్ అఫీషియో ఓటర్ల నమోదుపై ప్రజాప్రతినిధులకు సీఎం సూచనలు చేశారని తెలుస్తోంది.

**పురపాలక ఎన్నికల్లో సత్తాచాటిన కాంగ్రెస్ పార్టీ**

రాష్ట్రంలో ఇటీవల జరిగిన పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాచాటింది. మూడొంతులకు పైగా మున్సిపాలిటీలను ఆ పార్టీ 'హస్త'గతం చేసుకుంది. 52శాతానికి పైగా పురపాలక వార్డులను చేజిక్కించుకుని 66 పురపాలికల్ని తన ఖాతాలో వేసుకుంది. మరోవైపు హంగ్ మున్సిపాలిటీల్లోనూ అత్యధిక పీఠాలను చేజెక్కించుకునే విధంగా వ్యూహాలు రచిస్తోంది. ఇక్ ఎన్నికలు జరిగిన ఏడు కార్పొరేషన్లలో ఆరింటిని హస్తం పార్టీ దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా మంత్రులు, పార్టీ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## దెబ్బతీసిన రెబెల్స్

-మొదటిపేజీ తరువాయి

పోటీ చేశారు. కానీ ఓట్లు చీలి కాంగ్రెస్ అభ్యర్థి షేక్ ఎజాస్, బీఆర్ఎస్ అభ్యర్థిపై కేవలం ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. దాంతో బీఆర్ఎస్ నేతలు తలపట్టుకుంటున్నారు. కరీంనగర్ కార్పొరేషన్ 2వ డివిజన్‌లో బీఆర్ఎస్ రెబెల్ కారణంగా అక్కడ ఆ పార్టీ ఓటమికి గురయ్యింది. బీఆర్ఎస్ అభ్యర్థి చంద్రయ్యకు 938 ఓట్లు రెబెల్ అభ్యర్థి దాసరి సాగర్‌కు 1,535 వచ్చాయి. దాంతో అక్కడ 1,703 ఓట్లు పొందిన బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ విజేతగా నిలిచారు.

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో 114 వార్డుల్లో కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థుల కారణంగా రెండు చోట్ల ఓడిపోయింది. ఒకటో వార్డులో కేవలం తొమ్మిది ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి కాంతయ్యపై బీజేపీ అభ్యర్థి సిద్ధార్థ గెలిచాడు. 14 వార్డులో ఇద్దరు కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థులు 290 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి అడ్డగూరి రమేశ్‌కు 111 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థికి 411 ఓట్లు దక్కాయి. కాంగ్రెస్ అభ్యర్థులు వేర్వేరుగా పోటీ చేయడంతో ఓటర్లు సైతం బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపారని కాంగ్రెస్ నేతలు విశ్లేషిస్తున్నారు.

జనగామ మున్సిపాలిటీలో 2 స్థానాలు, మహబూబాబాద్ మున్సిపాలిటీలో ఐదు చోట్ల రెబెల్స్ కారణంగా కాంగ్రెస్ నష్టపోయింది.

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపాలిటీలోని 16వ వార్డులో రెబెల్ అభ్యర్థి కారణంగా కాంగ్రెస్ ఒక వార్డును కోల్పోయింది. అక్కడ పురపాలికలోని కాంగ్రెస్ అభ్యర్థికి 250 ఓట్లు దక్కగా రెబెల్‌కు 222 ఓట్లు లభించాయి. ఫలితంగా బీఆర్ఎస్ అభ్యర్థి గజ్జల మహేశ్ కేవలం 13 ఓట్ల తేడాతో గెలిచారు. 17వ వార్డులో కాంగ్రెస్ తరఫున ఇద్దరు తిరుగుబాటు అభ్యర్థులు పోటీలో నిలిచారు. దాసరి స్వరూపకు 174 ఓట్లు, దాసరి గంగా జమునకు 80 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థిని షబానా షర్వీన్‌కు 232 ఓట్లు వచ్చాయి. ఫలితంగా ఆమెపై ఇండిపెండెంట్ అభ్యర్థిని ఫర్హానాజ్ 23 ఓట్లతో సత్తా చాటింది.

ఇల్లెందు మున్సిపాలిటీలో 24 వార్డులో దాదాపు 19 స్థానాలు కాంగ్రెస్ బరిలో నిలిచింది. 3 వార్డుల్లో బీఆర్ఎస్, రెండు చోట్ల ఇద్దరు స్వతంత్రులు సత్తా చాటారు. అయితే ఇక్కడ స్వతంత్రుల్లో ఒకరు కాంగ్రెస్ రెబెల్. మొత్తం మీద ఇక్కడ అధికార పార్టీకి కనీస పోటీ ఇవ్వలేకపోయింది. మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరటం, అభ్యర్థుల ఎంపికలో లోటుపాట్ల కారణంగా బీఆర్ఎస్ భారీ మూల్యం చెల్లించుకుంది.

మొత్తం మీద రెబల్స్ ఎఫెక్ట్ అన్ని పార్టీల మీద కనిపించింది. అధికార పార్టీనే కాకుండా అటు విపక్షమైన బీఆర్ఎస్, బీజేపీలకు అసంతృప్తుల సెగ గట్టిగానే తగిలింది. పార్టీ జెండాలు మోసిన తమకు టికెట్ ఇవ్వకుంటే గెలుపోటములను ఎలా ప్రభావితం చేస్తామో రెబల్స్ అన్ని పార్టీలకు రుచి చూపించారు.

## ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం

-మొదటిపేజీ తరువాయి

ఆరోపణలు చేసింది. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ ఇప్పటికే పలుమార్లు ఏసీబీ విచారణకు హాజరయ్యారు. రెండు సార్లు ఏసీబీ విచారణకు, ఒకసారి ఈడీ విచారణకు కేటీఆర్ హాజరయ్యారు. ఇక, ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై 2024 డిసెంబరు 18న ఏసీబీ కేసు నమోదు చేసింది. ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిపై కేసు నమోదు చేసంది.

## ది ట్రైలర్ మాత్రమే..

-మొదటిపేజీ తరువాయి



కూయవద్దని బీఆర్ఎస్ వారిని హెచ్చరించారు. ఇప్పటికైనా మీ తప్పులను సరిదిద్దుకోవాలని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వారు ఉద్యమకారులను కూడా పట్టించుకోలేదని ఆరోపించారు.

జూబ్లీహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, గతంలో 90 శాతం మున్సిపాలిటీలను గెలుచుకున్న బీఆర్ఎస్ ఈసారి 16 స్థానాలకే పరిమితమైందని కవిత గుర్తు చేశారు. ప్రజల మద్దతును ఎందుకు కోల్పోయామో బీఆర్ఎస్ ఆలోచించాలని సూచించారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ పనిచేసిందని కవిత ఆరోపించారు. ఆ రెండు పార్టీల పొత్తుకు ఇది తొలి మెట్టు అన్నారు. కాంగ్రెస్ పార్టీతో మిలాఖత్ అయిన సీపీఐకి కొత్తగూడంలో బీఆర్ఎస్ పార్టీ మద్దతివ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై సాంబశివరావు చేసిన ఆరోపణలను అంగీకరిస్తున్నారా అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. తెలంగాణలో ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు వేశారని అన్నారు. ఆ లోటును తెలంగాణ జాగృతి భర్తీ చేస్తుందని కవిత పేర్కొన్నారు. బీజేపీ కరీంనగర్‌లో తప్ప ఎక్కడా గెలవలేదని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ రూ.30 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. తమకు 17 స్థానాలు రావడమే చాలా ఎక్కువ అన్నట్లుగా కేటీఆర్ మాట్లాడటం విచిత్రమని కవిత అన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిబంధనలను ఉల్లంఘించారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు.

**వడ్డేపల్లి మున్సిపాలిటీ విజయంపై కవిత**

జాగృతి రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించిన తర్వాత తమ పార్టీకి చెందిన నాయకులు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారని అన్నారు. తక్కువ సమయంలోనే ప్రజలు తమను ఆదరించారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి, ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ కలిసి పోటీ చేసి అద్భుత విజయాన్ని సాధించాయని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తాము 40 వార్డులు గెలుచుకున్నామని అన్నారు. అధికారికంగా 33 స్థానాల్లో తమ అభ్యర్థులు విజయం సాధించారని, మరో 7చోట్ల సాంకేతిక కారణాల వల్ల స్వతంత్రులుగా గెలిచారని వెల్లడించారు. ముఖ్యంగా వడ్డేపల్లి మున్సిపాలిటీలో తమకు స్పష్టమైన మెజారిటీ వచ్చిందని కవిత వెల్లడించారు. తమ విజయంలో తెలంగాణ జాగృతి ప్రమేయం లేదని ఏఐఎఫ్‌బీ నాయకుడు వడ్డేపల్లి శ్రీనివాసులు నిన్న ప్రకటించారు. అయితే ఈరోజు కవిత ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అంబటి బోజిరెడ్డి, హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించడం గమనార్హం. వడ్డేపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ జాగృతి, ఏఐఎఫ్‌బీ కలిసి కైవసం చేసుకున్నాయని కవిత స్పష్టం చేశారు.

ధర్మఘంట

# కొర్రలు వర్సెస్ గోధుమ రవ్వ.. మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్‌లో ఏది బెటర్..!





కొర్రలు అధిక ఫైబర్, కాల్షియం, ఐరన్ కలిగి బరువు తగ్గింపు, మధుమేహ నియంత్రణకు అద్భుతంగా పనిచేస్తాయి. గోధుమ రవ్వతో పోలిస్తే, కొర్రలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, ఎముకలను బలపరుస్తాయి, రక్తహీనతను నివారిస్తాయి. శక్తినిచ్చి, చర్మ ఆరోగ్యాన్ని కాపాడే కొర్రలు సంపూర్ణ ఆరోగ్యానికి ఉత్తమమైన ఎంపిక. కొర్రలు ఫైబర్ ఎక్కువగా ఉండి ఎక్కువసేపు ఆకలి రాకుండా చేస్తాయి. కొర్రలు కాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ః కాంప్లెక్స్ వంటి పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ఎముకలు, రక్తం, జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. కొర్రలలో అధిక మొత్తంలో కాల్షియం ఉంటుంది. ఇది ఎముకలు, దంతాల బలాన్ని పెంచుతుంది. ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. గోధుమ రవ్వ శరీరానికి శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లను అందిస్తుంది. డైట్ లక్ష్యాన్ని బట్టి ఈ రెండింటినీ ఎంచుకోవాలి. శ్రమ ఎక్కువగా చేసే వారికి గోధుమ రవ్వ సరిపోతుంది. బరువు తగ్గే డైట్‌లో కొర్రలు ఐదు రెట్లు ఎక్కువగా పనిచేస్తాయి. బరువు తగ్గాలంటే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న కొర్రలు ఎక్కువగా ఉపయోగపడతాయి. కొర్రలు కడుపుకు తేలికగా జీర్ణమవుతాయి. కొర్రలు మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా ఉపయోగకరం. ఎందుకంటే, ఇందులో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటాయి., అంటే ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతాయి. జీర్ణక్రియ మెరుగుపడి మలబద్ధకం, గ్యాస్ లాంటి సమస్యలు తగ్గుతాయి. రక్తంలో షుగర్ లెవెల్స్ స్థిరంగా ఉండటానికి ఇది సహాయపడుతుంది. శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తూ అలసట తగ్గుతుంది. కొన్ని రోజుల్లోనే గోధుమ రవ్వ రుచికి అలవాటు పడిపోతారు. కొర్రలలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది మలబద్ధకం, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. గోధుమ రవ్వలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల కడుపు ఎక్కువసేపు నిండిన భావన కలుగుతుంది.కొర్రలలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది, ఇది రక్తహీనత (అనీమియా) నివారణకు సహాయపడుతుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. కొర్రలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మరియు అమినో ఆమ్లాలు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి వృద్ధాప్య లక్షణాలను తగ్గించి, చర్మం ప్రకాశవంతంగా కనిపించేలా చేస్తాయి.


# అవిసె గింజలతో చెడు కొలెస్ట్రాల్‌కు చెక్..



ఆరోగ్యంగా ఉండాలని ఎన్నో రకాల విదేశీ ఆహార పదార్థాల కోసం వెతుకుతూ ఉంటాం. కానీ మన వంటగదిలోనే పోషకాల గని దాగి ఉందని చాలామందికి తెలియదు. అవే 'అవిసె గింజలు'. చూడటానికి చిన్నవిగా కనిపించినా, ఇవి చేసే మేలు మాత్రం అపారం. ముఖ్యంగా గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ, పెరుగుతున్న బరువును అదుపు చేయడంలోనూ ఇవి మ్యాజిక్ లా పనిచేస్తాయి. నేటి కాలంలో ఒత్తిడి, సరిగ్గా లేని ఆహారపు అలవాట్ల వల్ల వచ్చే కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి సమస్యలకు అవిసె గింజలు ఒక సహజ సిద్ధమైన మందుగా ఉపయోగపడతాయి. అవిసె గింజల్లో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే ఆల్ఫా లైనోలిక్ యాసిడ్ (ఒ౨ం) గుండె కండరాలను బలపరచడమే కాకుండా, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. దీనివల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. అంతేకాకుండా, వీటిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండటం వల్ల శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. తక్కువ క్యాలరీలు ఉండే ఈ గింజలను ప్రతిరోజూ ఒక చెంచా పొడి రూపంలో లేదా స్మూతీలలో కలుపుకొని తీసుకోవడం వల్ల గుండె పదిలంగా ఉంటుంది.

మన శరీరంలో పేరుకుపోయే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో అవిసె గింజలు అద్భుతంగా పనిచేస్తాయని పలు పరిశోధనలు వెల్లడించాయి. ఇందులో ఉండే కరగని ఫైబర్ (పీచు పదార్థం) జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. దీర్ఘకాలిక మలబద్ధక సమస్యతో బాధపడేవారు ఒక గ్లాసు నీటిలో నానబెట్టిన అవిసె గింజలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది మెటబాలిజం రేటును పెంచి, శరీరాన్ని చురుకుగా ఉంచుతుంది. బీపీ లేదా హైపర్ టెన్షన్ తో సతమతమయ్యే వారు ప్రతిరోజూ అవిసె గింజలను తీసుకోవడం శ్రేయస్కరం. ఇది సిస్టోలిక్, డిస్టోలిక్ బ్లడ్ ప్రెషర్ రెండింటినీ అదుపులో ఉంచుతుంది. ఉదయం బ్రేక్ ఫాస్ట్ లో ఒక టేబుల్ స్పూన్ లేదా రాత్రి డిన్నర్ సమయంలో వీటిని ఆహారంతో పాటు తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా వాడటం వల్ల రక్తపోటు సహజంగానే అదుపులోకి వస్తుంది. వెయిట్ లాస్ జర్నీలో ఉన్నవారికి అవిసె గింజలు ఒక ఉత్తమ ఆహారం. ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల వీటిని తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. దీనివల్ల పదే పదే ఆకలి వేయదు, తద్వారా అతిగా తినడం తగ్గుతుంది. బరువు నిర్వహణలో ఉన్నవారు సలాడ్లు, చపాతీలు లేదా యోగార్ట్ లో వీటి పొడిని వేసుకొని తీసుకోవచ్చు.షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారికి, ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి అవిసె గింజలు ఎంతో మేలు చేస్తాయి. వీటిని పొడి రూపంలో తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు హఠాత్తుగా పెరగకుండా ఉంటాయి. యోగార్ట్ లేదా పన్నీర్ వంటి ప్రోటీన్ ఆహారంతో కలిపి వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సున్నితత్వం పెరుగుతుంది. ఇందులో ఉండే లిగనన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. అవిసె గింజలు మన ఆరోగ్యానికి ప్రకృతి ప్రసాదించిన వరం. అయితే వీటిని నేరుగా తినడం కంటే వేయించి లేదా పొడి చేసి తీసుకోవడం వల్ల పోషకాలు శరీరానికి మెరుగ్గా అందుతాయి. చపాతీ పిండిలో లేదా కూరల్లో కూడా వీటి పొడిని వాడుకోవచ్చు.

# రోజుకో అరటిపండు తింటే.. శరీరంలో జరిగేది తెలిస్తే నోరెళ్లబెడతారు



తక్కువ ధరలో.. సామాన్యుడికి సైతం అందుబాటులో ఉండే అరటిపండు తింటే డాక్టర్‌కు దూరంగా ఉండవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో, ముఖ్యంగా జీర్ణవ్యవస్థను కాపాడటంలో అరటిపండును మించిన పండు లేదని పరిశోధనల్లో తేలింది. అందుకే దీనిని పొట్టకు అమృతం అని పిలుస్తారు. పోషకాల గని: ఒక అరటిపండును కేవలం చిరుతిండిగా చూడకూడదు. ఇది పోషకాల పవర్‌హౌస్. ఒక సాధారణ పరిమాణంలో ఉండే అరటిపండు సుమారు 105 కేలరీల శక్తిని అందిస్తుంది. ఇందులో 1.29 గ్రాముల ప్రోటీన్, 3.07 గ్రాముల ఫైబర్ ఉండటంతో పాటు విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా లభిస్తాయి. ముఖ్యంగా ఇందులో ఉండే 88.4 గ్రాముల నీటి శాతం శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. కొవ్వు శాతం దాదాపు శూన్యం కావడంతో బరువు తగ్గాలనుకునే వారు కూడా దీనిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. జీర్ణవ్యవస్థకు ప్రాణవాయువు: అరటిపండు జీర్ణక్రియను మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే రెసిస్టెన్స్ స్టార్చ్, ప్రీబయోటిక్ ఫైబర్ పేగులలోని మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా మారుతాయి. దీనివల్ల జీర్ణవ్యవస్థ చురుగ్గా మారుతుంది. పచ్చి అరటిపండ్లలో ఉండే యాంటీ అల్సర్ గుణాలు కడుపులో గ్యాస్ సమస్యలను తగ్గించడమే కాకుండా కడుపు లోపలి పొరను రక్షిస్తాయి. తద్వారా అల్సర్లు, మలబద్ధకం వంటి సమస్యల నుండి శాశ్వత ఉపశమనం లభిస్తుంది. రక్తపోటు నియంత్రణలో మేటి: ప్రస్తుత ఒత్తిడితో కూడిన జీవితంలో రక్తపోటు అనేది ఒక సాధారణ సమస్యగా మారింది. అరటిపండులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది శరీరంలోని అదనపు సోడియం ప్రభావాన్ని తగ్గించి, రక్తనాళాల మీద ఒత్తిడిని తగ్గిస్తుంది. రోజూ ఒక అరటిపండు తింటే గుండె ఆరోగ్యంగా ఉండటమే కాకుండా స్ట్రోక్ వంటి ప్రమాదాలు దరిచేరకుండా ఉంటాయి. తక్షణ శక్తి – ఒత్తిడి నివారణ: పని ఒత్తిడిలో ఉన్నప్పుడు లేదా వ్యాయామం చేసిన తర్వాత నీరసంగా అనిపిస్తే.. అరటిపండు ఒక ఇన్స్టంట్ ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తుంది. ఇందులో ఉండే సహజ చక్కెరలు తక్షణ శక్తినిస్తాయి. అంతేకాకుండా దీనిలోని యాంటీఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి మెదడును ప్రశాంతంగా ఉంచుతాయి.

## చిన్న వయసులోనే పిల్లల్లో మానసిక సమస్యలు కారణం అదేనని అంటున్న నిపుణులు!



చిన్న వయసులోనే పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడం వల్ల వారి మానసిక, శారీరక అభివృద్ధి కుంటుపడుతుంది. కొంతమంది పిల్లలు ఈ మొబైల్ ఫోన్లకు ఎంతగా బానిసలయ్యారంటే తమ తల్లిదండ్రులతో కూడా సమయం గడపడం లేదు. వారి నుంచి మొబైల్ ఫోన్లను లాక్కుంటే తీవ్ర స్థాయిలో కోపం, అసహనం, మానసిక ఒత్తిడిని ప్రదర్శిస్తుంటారు. మొబైల్ ఫోన్లు, టీవీలు పిల్లల బాల్యాన్ని దోచుకుంటున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నేటి కాలంలో పిల్లలు బయట ఆడుకునే బదులు టీవీ చూస్తూ, ఫోన్లు వాడుతూ సమయం గడుపుతున్నారు. ఇది వారి మానసిక ఆరోగ్యం, శారీరక అభివృద్ధిని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తోంది.న్యూరో కేర్ సెంటర్‌కు చెందిన డాక్టర్ జాలీ జైన్ గుప్తా మాట్లాడుతూ.. సాధారణంగానే నేటితరం తల్లిదండ్రులు తమ పిల్లలకు తగినంత సమయం ఇవ్వలేకపోతున్నారు. అంతేకాకుండా పిల్లలు అల్లరి చేయకుండా ప్రశాంతంగా ఉంచడానికి మొబైల్ ఫోన్లు, టీవీల ముందు కూర్చోబెడుతున్నారు. ఇది పిల్లల మానసిక సమతుల్యతను మరింత దిగజార్చుతుంది. అంతేకాకుండా వారి సామాజిక, శారీరక అభివృద్ధి కూడా కుంగిపోతుంది. ఆటలు, క్రీడలు వంటి సహజ కార్యకలాపాలు కూడా తగ్గుతున్నాయి. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలతో పాటు తమకు తాముగా కఠినమైన పరిమితులను ఏర్పరచుకోవడం వంటి కొన్ని చిట్కాలను పాటించడం మంచిదని అన్నారు. 2 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలను మొబైల్ ఫోన్లకు పూర్తిగా దూరంగా ఉంచాలి. వారికి వీడియో కాల్స్ చేయడానికి కూడా అనుమతించకూడదు. ఈ వయస్సులో స్క్రీన్ వాడకంవల్ల మెదడు అభివృద్ధిపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. 2 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న పిల్లలకు స్క్రీన్ సమయం చాలా పరిమితం చేయాలి. చదవడానికి ఉపయోగించినప్పటికీ రోజుకు 15 నిమిషాల కంటే ఎక్కువ సమయం ఇవ్వకూడదు. వారిని ఆన్‌లైన్ గేమ్స్, వీడియోలు, రీల్స్‌కు దూరంగా ఉంచాలి. వీటన్నిటితో పాటు మొబైల్ ఫోన్లు ఉపయోగించే సమయాన్ని పరిమితం చేయాలి.

# యాసంగి పంట పెట్టుబడి సహాయాన్ని వెంటనే విడుదల చేయాలి

## బిజెపి మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్

**రాజన్న సిరిసిల్ల :** అమలు కానీ ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల రెండు నెలలు అవుతున్న ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తూనే ఉందని బీజేపీ మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ అన్నారు. ఎన్నికల హామీల్లో నమ్మి మోసపోయిన వాళ్ళలో రైతులే ముఖ్యంగా ఉన్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎన్నికల సమయంలో రైతులకు రైతు భరోసా పేరు తో 15000 ఇస్తానని ఇవ్వలేదని అన్నారు. కౌలు రైతులకు సంవత్సరానికి 12,000 చొప్పున ఇస్తా అని చెప్పి ఇవ్వలేదని అన్నారు. వడ్లకు బోనస్ గా 500 రూపాయలు ఇస్తా అని చెప్పి ఇప్పటివరకు దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వనేలేదన్నారు. పంట పెట్టుబడి సహాయంగా రైతుకు అందాల్సిన 2024 ఖరీఫ్ అమౌంట్ ఇప్పటివరకు అందజేయలేదని అన్నారు. ప్రస్తుతం డిసెంబర్ జనవరి నెలలో జమ చేయవలసిన యాసంగి పెట్టుబడి అమౌంట్ కూడా జమ చేయలేదని అన్నారు. కానీ పరిషత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ కార్పొరేషన్ లో మాట్లాడుతూ సంబంధం లేకుండా రైతు భరోసా విషయం మాట్లాడారని అన్నారు. పట్టణాల్లో కార్పొరేషన్ లో రైతు భరోసా విషయం మాట్లాడాల్సిన అవసరం లేదని అన్నారు. కానీ రాబోయే పరిషత్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, రైతు భరోసా విషయాన్ని మళ్ళీ లేవనెత్తారని ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. రైతులు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని అన్నారు. 2024 ఖరీఫ్ లో బాకీ పడిన పెట్టుబడి సాయాన్ని గుర్తుంచుకున్నారని, అదేవిధంగా డిసెంబర్ జనవరి వేయాల్సిన ప్రస్తుత సాయాన్ని కూడా



గమనిస్తున్నరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల యొక్క విశ్వాసాన్ని కోల్పోయిందని రాబోయే పరిషత్ ఎన్నికల్లో ఖచ్చితంగా బుద్ధి చెప్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. తక్షణమే రైతు పెట్టుబడి సాయం విడుదల చేయాలని, లేని పక్షంలో పార్టీ కార్యాచరణ అనుగుణంగా ఉద్యమిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మేకల మల్లేశం జిల్లా కౌన్సిల్ మెంబర్ బత్తిని సాయ గౌడ్, జిల్లా నాయకులు కొలనురు ముత్తవ్వ, నాయకులు పినికాసి అనిల్, భూత్ అధ్యక్షులు తుమ్మలపెల్లి కమలాకర్ రావు ,పిల్లి గోపాల్ పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

**సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్**

**భీమేశ్వర ఆలయంలో పూజలు**

**ఆర్టీసీ ఉచిత రవాణా బస్సు ప్రారంభం**

**రాజన్న ఆలయ విస్తరణ పనులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలన**



**రాజన్న సిరిసిల్ల :** రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వేములవాడకు రాగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో అర్చకులు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ కు స్వస్తితో స్వాగతం పలికారు ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని అందజేసి, ఆశీర్వచనం అందించారు.

**ఆలయ విస్తరణ పనుల పరిశీలన**

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన ఫోటోలు పరిశీలించారు. పనులపై పలు సూచనలు చేశారు.

**ఉచిత బస్సు సర్వీసులు ప్రారంభం**

వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం దాకా భక్తులను ఉచితంగా తరలించే ఆర్టీసీ బస్సులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు.

**ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి**

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులు, ఆర్కిటెక్ట్ మూర్తి, కాంట్రాక్టర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పనివారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. పనుల పురోగతిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సూచించారు. నూతన గోశాల నిర్మాణం, ఇతర అంశాలపై చర్చించారు. ఇప్పుడు ఉన్న గోశాలలో ఎన్ని కోడెలు ఉన్నాయని ఆరా తీశారు. వాటి సంరక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, గుడి చెరువు బండ్ పార్క్ పనులపై సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్ కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఏర్పాటు చేసి వివరించారు. సమావేశంలో ఆర్అండ్ బీ సీఈ రాజేశ్వర్, ఎస్ఈ రాములు ఈఈ నరసింహాచారి, ఆలయ ఈఈ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో పంచాయితీ తేలేనా




**ఖమ్మం :** కొత్తగూడెం కార్పొరేషన్ పీఠాన్ని దక్కించుకునే క్రమంలో తెలంగాణ రాజకీయం ఆసక్తికర మలుపు తిరిగింది. అక్కడ కాంగ్రెస్ పార్టీకి మేయర్ పదవి దక్కకుండా చేసేందుకు, తమ పార్టీకి చెందిన ఎనిమిది మంది కార్పొరేటర్ల మద్దతును సీపీఐకి ఇస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించడం చర్చనీయాంశమైంది. అయితే, ఈ ప్రకటన చేసే ముందు ఆయన కనీసం తమ పార్టీ కార్పొరేట ర్లతో గానీ, ఖమ్మం జిల్లా కీలక నేతలతో గానీ సంప్రదించకుం డానే నేరుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావుకు ఫోన్ చేసి చెప్పారు.. తర్వాత ప్రెస్మీట్ లో ప్రకటిం చారు. కేటీఆర్ మద్దతు ప్రతిపాదనను సీపీఐ స్వీకరిస్తుందా అంటే అనుమానమే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఎందుకంటే సీపీఐ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీతో ధృడమైన పొత్తులో ఉంది. కేవలం తెలంగాణలోనే కాకుండా జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నుండి కాంగ్రెస్ మద్దతుతోనే విజయం సాధించారు. స్థానిక ఎన్నికల్లో కేవలం సీట్ల సర్దుబాటు కుదరక విడివిడిగా పోటీ చేసినంత మాత్రాన, మేయర్ పదవి కోసం కాంగ్రెస్‌తో బంధాన్ని తెంచుకుని బీఆర్ఎస్‌తో చేతులు కలిపే అవకాశాలు ఉండవు. కేటీఆర్ ఫోన్ కాల్‌పై స్పందించిన కూనంనేని.. తమ నిర్ణయం వ్యక్తిగతం కాదని, జాతీయ నాయకత్వ నిర్ణయం మేరకే నడుచుకుంటామని స్పష్టం చేశారు. దీని వెనుక ఉన్న అంతరార్థం ఏమిటంటే.. ఒక మేయర్ పదవి కోసం జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో ఉన్న సంబంధాలను సీపీఐ పణంగా పెట్టదు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో కలిసి మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను పంచుకుని స్థానిక పాలనను సాఫీగా సాగించడానికే ఆ పార్టీ మొగ్గు చూపే అవకాశం ఉంది. గతంలో మునుగోడు ఉప ఎన్నికల సమయంలో సీపీఐ మద్దతు కోసం బీఆర్ఎస్ చాలా హామీలిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ పొత్తులు కొనసాగిద్దామని కేసీఆర్ చెప్పారు. అయితే మునుగోడు విజయం తర్వాత కనీసం ప్రగతి భవన్ గేట్లు కూడా తెరవకుండా కమ్యూనిస్ట్ నేతలను బీఆర్ఎస్ విస్మరించిందనే అసంతృప్తి వారిలో బలంగా ఉంది. ఆ చేదు అనుభవాల తర్వాతే సీపీఐ నేతలు కాంగ్రెస్ గూటికి చేరారు. నిజానికి కొత్తగూడెంలో సీపీఐకి మేయర్ పదవి కట్టబెట్టాలనే ప్రేమ కంటే, కాంగ్రెస్–సీపీఐ మధ్య చిచ్చు పెట్టి ఆ కూటమిని బలహీనపరచడమే కేటీఆర్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. సీపీఐ గనుక ఈ ఆఫర్‌కు మొగ్గు చూపితే, కాంగ్రెస్ నుండి వారిని శాశ్వతంగా దూరం చేయవచ్చని ఆయన భావిస్తున్నారు. కానీ, రాజకీయ పరిణతి కలిగిన కమ్యూనిస్ట్ పార్టీలు కేటీఆర్ వేసిన ఈ బంతి 'ని జాగ్రత్తగా గమనిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, కొత్తగూడెం కార్పొరేషన్‌లో కాంగ్రెస్ మరియు సీపీఐలు కలిసి అధికారాన్ని పంచుకునే అవకాశాలే మెండుగా ఉన్నాయని భావించవచ్చు.

## ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా గుండె వాల్వ్ చికిత్స

**సికింద్రాబాద్ :** వృద్ధాప్యంలో గుండె ఆపరేషన్ అంటే ప్రమాదమనే భయాన్ని చెదరగొడుతూ, ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే 72 ఏళ్ల వృద్ధురాలికి మిట్రల్ వాల్వ్ లీకేజీపై చికిత్స అందించ అరుదైన విజయం సాధించినట్లు సికింద్రాబాద్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు.కొన్ని నెలలుగా ఆమెకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చిన్న పని చేసినా ఆయాసం, తీవ్ర అలసట వంటి సమస్యలు ఉండేవి. మొదట వీటిని వయస్సు ప్రభావంగా భావించి నిర్లక్ష్యం చేశారు. అయితే పరిస్థితి విషమించి గుండె వైఫల్యంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. పరీక్షల్లో ఆమె మిట్రల్ వాల్వ్‌లో తీవ్రమైన లీకేజ్ ఉన్నట్లు గుర్తించారు. వైద్యుల ప్రకారం, భారతదేశంలో 65 ఏళ్లు పైబడిన వారిలో ప్రతి 10 మందిలో ఒకరికి వాల్వ్ సంబంధిత సమస్యలు ఉండే అవకాశం ఉంది.ఆమె వయస్సు మరియు ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ హార్ట్ సర్జరీ ప్రమాదకరమని భావించారు. దీంతో మల్టీడిసిప్లినరీ హార్ట్ టీమ్ కేసును సమగ్రంగా పరిశీలించింది. కాథెటర్ ద్వారా మినిమల్ ఇన్వేసివ్ పద్ధతిలో చికిత్స నిర్వహించారు. కాలి రక్తనాళం ద్వారా చిన్న ట్యూబ్ పంపించి, ఆధునిక ఇమేజింగ్ సాయంతో వాల్వ్ లీకేజీని తగ్గించారు.ఈ సందర్భంగా డా. ప్రమోద్ కుమార్ కుచులకంటి మాట్లాడుతూ, "వృద్ధుల్లో కనిపించే ఆయాసం, అలసటను కేవలం వయస్సు కారణంగా భావించకూడదు. సకాలంలో పరీక్షలు చేయించుకుంటే ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే ఆధునిక పద్ధతుల్లో సురక్షితంగా చికిత్స చేయవచ్చు. హార్ట్ టీమ్ సమిష్టి నిర్ణయం వల్ల ప్రతి రోగికి తగిన చికిత్సను ఎంపిక చేయడం సాధ్యమవుతోంది," అన్నారు.ప్రస్తుతం రోగి స్థిరంగా ఉండి, శ్వాసలో గణనీయమైన మెరుగుదలతో రోజువారీ పనులు స్వయంగా చేసుకుంటున్నారు.మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం సహకారంతో ఇటువంటి అత్యాధునిక గుండె చికిత్సలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని వైద్య బృందం తెలిపారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

**సికింద్రాబాద్ :** సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని,సైబర్ నేరగాళ్ల మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షితమూర్తి తెలిపారు. మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధి కళాసి గూడ లో సైబర్ నేరాల పట్ల స్థానిక ప్రజలకు వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య క్రమంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాల్సిన బాధ్యత ఉందని అన్నారు. నకిలీ వ్యక్తుల ప్రొఫైల్స్ తో, నకిలీ కొరియర్ల పేరిట మోసాలు చేసేవారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యాపారస్తులు పనిలో చేర్చుకునే ముందు వారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తీసుకోవాలని సూచించారు. ఇటీవల బంగారు దుకాణాలలో పని చేసే వారే దొంగతనాలు చేస్తున్నారు క్రమంలో జాగ్రత్త వహించాలని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో జిల్లాకు, జోగులాంబ జోన్కు మంచి పేరు తీసుకురావాలి

**జిల్లా ఎస్పీ డి.జానకి**

**మహబూబ్ నగర్ :** తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్లో పాల్గొనబోయే మహబూబ్ నగర్ జిల్లా క్రీడాకారులు మహబూబ్నగర్ జిల్లాకు మరియు జోగులాంబ జోన్కు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ డి.జానకి ఆకాంక్షించారు. ఫిబ్రవరి 17 నుండి హైదరాబాద్లో ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్కు ఎంపికైన క్రీడాకారులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, క్రీడలు కేవలం పోటీలు మాత్రమే కాకుండా పోలీస్ శాఖలోని క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సహనశక్తి మరియు నాయకత్వ లక్షణాలను ప్రతిబింబించే వేదిక అని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా ఎస్పీ స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్లు, స్పోర్ట్స్ షూస్ అందజేశారు. క్రీడాకారులు సరైన సాధనతో, పూర్తి నిబద్ధతతో పోటీల్లో పాల్గొని మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి వేదికపై పాల్గొనే ప్రతి క్రీడాకారుడు తన వ్యక్తిగత ప్రతిభతో పాటు జిల్లా మరియు జోన్ ప్రతిష్ఠను ప్రతిబింబిస్తాడని స్పష్టం చేశారు. గెలుపు లక్ష్యంగా కఠిన సాధన చేయాలని, నిరంతర శిక్షణ, క్రమశిక్షణ, మానసిక దృఢత్వం విజయానికి మూలాధారాలని పేర్కొన్నారు. మైదానంలో చూపే ప్రతీ ప్రదర్శన పోలీస్ శాఖ ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొంటూ, క్రీడాస్ఫూర్తితో, సంపూర్ణ నిబద్ధతతో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాకు మరియు జోన్కు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్ఐలు అడ్మిన్ కృష్ణయ్య, నగేశ్, సత్యం మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఐటీ కారిడార్లో రోడ్ల విస్తరణకు కసరత్తు

**అధికారుల సంయుక్త పరిశీలన**

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు విస్తరణ పనులపై దృష్టి సారించారు.సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కీలక మార్గాల్లో నెలకొన్న బాటిల్‌నెక్‌లను తొలగించి, రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు ఈరోజు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన ఐఏఎస్., జలమండలి అధికారి అశోక్ రెడ్డి ఐఏఎస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ భోర్కడే హేమంత్ సహదేవరావు ఐఏఎస్, ట్రాఫిక్–1 డీసీపీ జె. రంజన్ రతన్ కుమార్‌తో పాటు టీజీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం. కవిత వివిధ శాఖల ఉన్నతాధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా మాదాపూర్ లెమన్ ట్రీ హోటల్ నుంచి సైబర్ టవర్స్ వరకు, అక్కడి నుంచి మెడికోవర్ ఆస్పత్రి వరకు ఉన్న రహదారులను అధికారులు పరిశీలించారు. మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గం చెరువు, నెక్టర్ గార్డెన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సాఫీగా సాగకుండా అడ్డుపడుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రహదారి వెడల్పునకు ఆటంకంగా ఉన్న ఆక్రమణలు, విద్యుత్ స్తంభాలు, నీటి పైప్‌లైన్ల వంటి యుటిలిటీల మార్పుపై ఆయా శాఖల మధ్య సమన్వయం ఉండాలని అధికారులు ఆదేశించారు. పనులు జరిగే సమయంలో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ విస్తరణ పనుల ద్వారా ఐటీ కారిడార్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా, ప్రయాణికుల భద్రత కూడా పెరుగుతుందని అధికారులు వెల్లడించారు.

## నిజామాబాద్, కరీంనగర్ మావే




**హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఎన్నికల ఫలితాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంతృప్తిని వ్యక్తం చేశారు. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను కూడా తామే కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఈరోజు సమావేశమవుతానని... ఈ భేటీలో కార్పొరేషన్లపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ ఎన్నికలు కల్వకుంట్ల కవితకు సంతోషాన్ని ఇచ్చి ఉండవచ్చని మహేశ్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకు పతనమవుతోందని... రాబోయే రోజుల్లో ఆ పార్టీ ప్రభావం ఉండదని చెప్పారు. మతాన్ని రెచ్చగొట్టినా మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఏమీ సాధించలేకపోయిందని ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ఈ ఎన్నికల ఫలితాలతో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో తన పట్టును మరింత పెంచుకున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ధర్మఘంట



# విశ్వక్ సేన్ 'ఫంకీ'కి డీసెంట్ స్టార్ట్.. వాలెంటైన్స్ వీక్ ఎఫెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా, 'జాతిరత్నాలు' ఫేమ్ దర్శకుడు అనుదీప్ కేవీ కాంబినేషన్‌లో వచ్చిన అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ ఫంకీ బాక్సాఫీస్ వద్ద డీసెంట్ ఓపెనింగ్స్ నమోదు చేసింది. ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మొదటి రోజే ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 2.5 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. వాలెంటైన్స్ వీక్ కావడంతో ముఖ్యంగా యూత్ ఆడియన్స్ థియేటర్లకు ఆకర్షితులవుతున్నట్టు కనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా నైజాం ఏరియాలో సుమారు రూ. 1.25 కోట్లు గ్రాస్ వచ్చినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ. 1 కోటి వరకు వసూళ్లు నమోదయ్యాయి. ఇక ఇతర రాష్ట్రాలు, ఓవర్సీస్ కలుపుకుని మరో రూ. 25 లక్షల వరకు గ్రాస్ వచ్చినట్లు ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి. అనుదీప్ కేవీ స్టైల్ కామెడీ టైమింగ్, విశ్వక్ సేన్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్ సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సుమారు రూ. 15 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే వచ్చే రోజుల్లో నిలకడైన కలెక్షన్లు అత్యవసరం. అయితే నేడు వాలెంటైన్స్ డే, రేపు ఆదివారం సెలవు దినం కావడంతో వీకెండ్‌లో వసూళ్లు పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. యంగ్ ఆడియన్స్ నుండి మంచి టాక్ రావడం కూడా సినిమాకు ప్లస్ పాయింట్‌గా మారుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కయాదు లోహర్ నటించగా, సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందించారు. ఇప్పటికే పాటలు సోషల్ మీడియాలో చార్ట్‌బస్టర్లుగా మారి సినిమాకు మంచి బజ్ తీసుకొచ్చాయి. మొత్తానికి కామెడీ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికగా వచ్చిన 'ఫంకీ'కి మొదటి రోజు డీసెంట్ స్టార్ట్ లభించడం చిత్రబృందానికి ఊరటనిచ్చింది. వీకెండ్ కలెక్షన్లు ఎలా ఉంటాయన్నదే ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది.




## 'బ్యాండ్ మేళం' వాలెంటైన్స్ గ్లింప్స్ వైరల్.. రోషన్‌శ్రీదేవి ఎమోషనల్ లవ్ స్టోరీపై పెరిగిన అంచనాలు

టాలీవుడ్ యంగ్ పెయిర్ హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటిస్తున్న లేటెస్ట్ లవ్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ బ్యాండ్ మేళం పై రోజురోజుకీ ఆసక్తి పెరుగుతోంది. కొత్త దర్శకుడు సతీష్ జవ్వాజి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ రచయిత కోన వెంకట్ సమర్పిస్తున్నారు. కోన ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై కావ్య, శ్రావ్యలు నిర్మిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం యువ ప్రేక్షకుల్లో మంచి బజ్ సొంతం చేసుకుంది. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్రబృందం 'బ్యాండ్ మేళం' స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ గ్లింప్స్‌లో హీరో తన ప్రేమను వ్యక్తపరుస్తూ చెప్పిన ఎమోషనల్ డైలాగ్స్ ప్రేక్షకులను హత్తుకునేలా ఉన్నాయి. రొమాంటిక్ టోన్‌తో పాటు భావోద్వేగ సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ గ్లింప్స్ సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం విశేషం. 'బ్యాండ్ మేళం' పూర్తి స్థాయి ప్రేమకథగా ఉండబోతున్నప్పటికీ, ఇందులో కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేసినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. యువతను ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు హృదయాన్ని తాకే ఎమోషనల్ కంటెంట్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలవనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇంతకుముందు 'కోర్ట్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రోషన్‌శ్రీదేవి జంట మరోసారి ప్రేక్షకుల ముందుకు రావడం ఈ ప్రాజెక్ట్‌కు ప్లస్ పాయింట్‌గా మారింది.

# రాజాసాబ్‌లో డూప్ అంటూ ట్రోలింగ్.. స్పందించిన హీరోయిన్



ప్రభాస్– మారుతి కాంబినేషన్‌లో 'ది రాజాసాబ్' సినిమా ప్రకటించినప్పటి నుంచి విమర్శలు వెంటాడుతూనే ఉన్నాయి. తీరా సినిమా రిలీజయ్యాక కూడా ట్రోలింగ్స్ మరింత పెరిగాయే తప్ప ఆగలేవు. ముఖ్యంగా ప్రభాస్‌కు చాలాచోట్ల డూప్ ఉపయోగించడంపై విపరీతమైన విమర్శలు వచ్చాయి. ఓ ఫైట్ సీన్ కోసం హీరోయిన్ మాళవిక మోహనన్‌కు కూడా డూప్ ఉపయోగించడంతో తనను కూడా ట్రోల్ చేశారు.

ట్రోలింగ్‌పై స్పందించిన హీరోయిన్ తాజాగా ఈ వివాదంపై మాళవిక మోహనన్ స్పందించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ట్వీట్ చేసింది. ది రాజాసాబ్ సినిమాలో నేనే స్వతాహాగా స్టంట్స్ చేశానని చెప్పుకున్నాను. అయితే నా బాడీ డబుల్ (డూప్) యాక్షన్ సీన్‌లో ఉన్నట్లుగా ఓ ఫోటో వైరలవుతోంది. ఆ ఫోటోలో ఉన్న వ్యక్తి స్టంట్ ఆర్టిస్ట్.. అలాగే నా డూప్ కూడా!

**చిన్నతనం నుంచే..**

ముందుగా నేను చెప్పొచ్చేదేంటంటే.. నాకు యాక్షన్ అంటే ఇష్టం. ఫైట్ సన్నివేశాల్లో పాల్గొనడాన్ని ఆస్వాదిస్తాను. చిన్నతనం నుంచే నేను స్పోర్టివ్ అమ్మాయిని. కొత్త విషయాలు నేర్చుకోవడం, శరీరాన్ని ఛాలెంజ్ చేయడం అంటే చాలా ఇష్టం. రెండో విషయం.. సెట్‌లో ఎప్పుడూ స్టంట్ డబుల్స్ సిద్ధంగా ఉంటారు. నటీనటులు సొంతంగా యాక్షన్ సీన్స్ చేసినా సరే వారు అందుబాటులోనే ఉంటారు.

**రిస్కీ షాట్స్ మాత్రం..**

వారు అనుభవజ్ఞులు కాబట్టి.. యాక్షన్ డైరెక్టర్ వారిని ఫైట్ రిహార్సల్స్ చేయమని చెప్తాడు. ఫైనల్ షాట్ మాత్రం మాపై చిత్రీకరిస్తారు. అయితే కొన్ని సన్నివేశాలు చాలా ప్రమాదకరం అని భావించినప్పుడు నటులకు బదులుగా స్టంట్ డబుల్‌ను సీన్ పూర్తిచేయమని అడుగుతారు. ఎందుకంటే ప్రొఫెషనల్స్ అయితే ఏ సమస్యా లేకుండా వాటిని ఈజీగా చేయగలరు.

**వివరణ అక్కర్లేదు**

ఫైనల్‌గా.. నేను ఫైట్ సీన్స్ సమర్థవంతంగా చేసేందుకు నా స్టంట్ డబుల్ ఎంతగానో తోడ్పడింది అంటూ వీడియోలు షేర్ చేసింది. ఒక్క ట్వీట్ ద్వారా యాక్షన్ సీన్స్ తానే చేసినట్లు క్లారిటీ ఇచ్చింది. ఇది చూసిన అభిమానులు నువ్వు టాలెంటెడ్ అని మాకు తెలుసు.. నువ్వు ఎలాంటి వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం లేదు అంటున్నారు. ప్రస్తుతం రాజాసాబ్ హాట్‌స్టార్‌లో అందుబాటులో ఉంది.



# 'విశ్వనాథన్ అండ్ సన్స్'గా సూర్య వైరల్ అవుతున్న టైటిల్!

తమిళ అగ్ర దర్శకుడు సూర్య, దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించి ఆసక్తికరమైన అప్‌డేట్ ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. చూబతీఅఖు46 గా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కి 'విశ్వనాథన్ అండ్ సన్స్' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకోగా.. కేవలం ఐదు రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉండటంతో నిర్మాతలు పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి సారించారు. ఈ చిత్రం విడుదల తేదీపై నిర్మాత నాగవంశీ క్లారిటీ ఇస్తూ.. సూర్య నటిస్తున్న మరో చిత్రం 'కరుప్పు' విడుదలైన మూడు నాలుగు నెలల తర్వాతే ఈ సినిమా థియేటర్లలోకి వస్తుందని స్పష్టం చేశారు. 'కరుప్పు' చిత్రం ఏప్రిల్ 2026లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉండటంతో, వెంకీ అట్లూరి దర్శకత్వంలోని ఈ మూవీ జూలై లేదా ఆగస్టు 2026లో విడుదల కానుంది. సూర్య కెరీర్‌లో విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

## ధనుష్‌తో పెళ్లి పుకార్లపై మృణాల్ ఠాకూర్ ఫుల్ క్లారిటీ.. ఏప్రిల్ 1న చేసుకుంటా అంటూ సెటైర్



సినీ ఇండస్ట్రీలో రూమర్స్ అనేవి కొత్త విషయం కాదు. ఇద్దరు నటీనటులు కలిసి ఒక ఈవెంట్‌లో కనిపించినా, సోషల్ మీడియాలో వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరియు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విషయంలో కూడా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారన్న ప్రచారం సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ రూమర్స్‌కు అసలు కారణం ఒక పార్టీ. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ ఇద్దరూ కలిసి కనిపించడంతో మొదట సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దానికి తోడు మృణాల్ నటించిన ఓ సినిమా ఈవెంట్‌కు ధనుష్ హాజరుకావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అప్పటి నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వరుసగా వినిపించాయి. మృణాల్ గతంలో "మేము కేవలం మంచి స్నేహితులమే" అని చెప్పినా కూడా ఈ ప్రచారానికి బ్రేక్ పడలేదు. కొందరు అయితే మరో అడుగు ముందుకేసి వాలెంటైన్స్ డే రోజున అంటే ఫిబ్రవరి 14న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు సృష్టించారు.ఇటీవల తన హిందీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ ఠాకూర్‌ను యాంకర్ నేరుగా ఈ విషయంపై ప్రశ్నించాడు. "ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?" అని అడగగా మృణాల్ నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. "ఫిబ్రవరి 14 కాదుడ ఏప్రిల్ 1న చేసుకుంటానేమో. ఎందుకంటే అది ఏప్రిల్ ఫూల్స్ డే కదా!" అంటూ చమత్కరించింది. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. అదే ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ, "ఈ రూమర్స్ ఎక్కడి నుంచి వచ్చాయో కూడా నాకు తెలియదు. కొందరు 'మృణాల్ పెళ్లి అధికారికంగా ఖరారు అయింది' అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇది నిజంగా భయంకరంగా ఉంది" అని చెప్పింది. ఇలా క్లియర్ క్లారిటీ ద్వారా ధనుష్‌తో పెళ్లి వార్తలకు మృణాల్ పూర్తిగా చెక్ పెట్టినట్టే అయ్యింది.గతంలో ఈ డేటింగ్ రూమర్స్‌పై మృణాల్ ఒక పోస్ట్ పెట్టి "విని నవ్వుకుంటాం" అని రాసింది. అయితే ఇప్పుడు మొదటిసారి ఓ ఇంటర్వ్యూలో డైరెక్ట్‌గా స్పందించి పూర్తి క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం వీరిద్దరి మధ్య ఎలాంటి రిలేషన్ లేదని, కేవలం స్నేహం మాత్రమేనని మరోసారి స్పష్టమైంది.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# ఫుడ్ జిహాద్ ఆరోపణలు నిజమా...లేక మత విద్వేషమా...?

తెలంగాణలోని ములుగు జిల్లాలో జరిగే సమ్మక్క-సారలమ్మ మహాజాతర (మేడారం జాతర) సందర్భంగా పాలకోవా బన్ అమ్ముతున్న చిరు వ్యాపారులను కొందరు యూట్యూబ్ మీడియా ప్రతినిధులు టార్గెట్ గా చేసుకొని చేసిన హంగామా "ఫుడ్ జిహాద్" ఆరోపణలను పెద్దమొత్తంలో వైరల్ గా మార్చాయని గత కొన్ని రోజులుగా ఏ సోషల్ మీడియా వేదిక ఓపెన్ చేసినా అర్థమవుతుంది.భారతదేశంలోనే అతిపెద్ద గిరిజన ఉత్సవాల్లో మేడారం సమ్మక్క-సారక్క జాతర ఒకటి.ఈ జాతరకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,వివిధ రాష్ట్రాల నుండి లక్షలాది భక్తులు తరలివస్తారు.ఇక్కడ స్థానిక, వేర్వేరు ప్రాంతాల నుండి వచ్చే వ్యాపారులు వివిధ రకాల ఆహార పదార్థాలు జాతరలో అమ్ముతారు.తాజాగా ఇటీవల జరిగిన జాతర (జనవరి-ఫిబ్రవరి 2026)లో కోవా బన్ (పాలకోవా బన్) అమ్మే ఓ ముస్లిం వ్యాపారి (షేక్ షావలి లేదా షా వలీ అని పేర్లు వినిపిస్తున్నాయి)పై ఓ యూట్యూబ్ ఛానల్ చేసిన వీడియోలు తెగ వైరల్ అయ్యాయి.ఈ ఛానల్ యాంకర్స్ మరియు ఇతరులు వ్యాపారిని చుట్టుముట్టి కల్తీ జరుగుతుందని,ఇది అమ్మేది ముస్లిం వ్యాపారాలు కాబట్టి "ఫుడ్ జిహాద్"అనే ఆరోపణలతో ప్రశ్నల వర్షం కురుపించారు. చుట్టూ జన జాతరకు వచ్చిన జనం,ఛానల్ మైక్ లు పట్టుకొని యాంకర్స్ అడిగే ప్రశ్నలతో కంగారుపడిన వ్యాపారాలు వారు ఏది అడిగితే దానికి సమాధానం చెప్పారు.ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా కల్తీ బన్ ఎందుకు అమ్ముతున్నారని తుటాల్లాంటి మాటలతో దాడికి దిగడంతో ఆ చిరు వ్యాపారాలు బేంబేలెత్తిపోయారు.ఆ బన్ తినాలని హుకూం జారీ చేస్తే భయపడుతూ చెమటలు కక్కుతూ తిని చూపించారు.ఆ దృశ్యం అక్కడ ప్రత్యక్షంగా చూస్తున్నవారిని,సోషల్ మీడియాలో వీక్షిస్తున్నవారిని కూడా కదిలించి వేసింది.దీనితో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు చిరు వ్యాపారులకు మద్దతుగా పెద్ద మొత్తంలో రియాక్ట్ అయ్యారు. మరోవైపు రైట్ వింగ్ మద్దతుదారులు కూడా అంతే మొత్తంలో ఛానల్ వారికి సపోర్ట్ గా నిలిచారు.అందుకే ఈ అంశం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంత దుమారం రేపుతుంది.

**అసలు ఏమి జరిగింది?**

ముస్లిం వ్యాపారి మేడారం జాతరకు రాయలసీమ (కర్నూలు జిల్లా) నుంచి వచ్చి,కోవా బన్‌ను 10 రూపాయలకు అమ్ముతున్నారు. ఇది గమనించిన యూట్యూబర్లు బన్ ప్యాకెట్లపై తయారీ/గడువు తేదీలు లేవని,ఇంత తక్కువ ధరకు అమ్మడం సందేహాస్పదమని,కల్తీ ఉండవచ్చని ఆరోపించారు. "హిందూ జాతరలో ఇలాంటి కల్తీ ఆహారాలు అమ్మడం అసహ్యకరం"అంటూ విరుచుకుపడ్డారు.వ్యాపారిని ఆధార్ కార్డు చూపమని,బన్ తిని చూపమని ఒత్తిడి చేశారు.చివరికి అతన్ని బలవంతంగా బన్ తినేలా ఒత్తిడి తెచ్చారు.అతను కూడా వారి ఆదేశంతో బన్ తిన్నాడు. తింటున్నా యాంకర్ల ప్రశ్నలు మాత్రం ఆగలేదు.ఆ తర్వాత ఛానల్ వీడియోల్లో "ఫుడ్ జిహాద్" అనే పదం పదేపదే వాడారు,ఇది హిందూ రైట్ వింగ్ సర్కిల్స్ ప్రచారంలో ఉండే ముస్లింలు హిందువులకు ఆహారంలో కల్తీ చేసి,హాని చేస్తారనే ఆరోపించే కల్తీ ఆరోపణలుగా ఎక్కువమంది

**కొట్టిపారేస్తున్నారు.**

బన్ లో కల్తీ నిజమా నిజంగానే ఫుడ్ జిహాదీ జరుగుతుందా? ఏ విశ్వసనీయ సోర్స్‌లోనూ (పోలీస్,ఫుడ్ సేఫ్టీ అథారిటీ లేదా ఆఫీషియల్ రిపోర్టులు) కోవా బన్‌లో కల్తీ లేదా వ్యాపారి విషపూరితం చేశాడనే ఆధారాలు ఇప్పటి వరకు లేవు. ఛానల్ ఆరోపణలు ప్రధానంగా ధర తక్కువగా ఉండటం,లేబుల్ లేకపోవడం మీద ఆధారపడ్డాయి.అయితే,జాతర లాంటి టెంపరరీ స్టాల్స్‌లో చాలా చోట్ల లేబులింగ్ లేకపోవడం సాధారణంగా కమిపిస్తుంది. వ్యాపారి ఇంట్లోనే కోవా తయారుచేసి అమ్ముతున్నాడని చెప్పాడు.ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్షన్ లేదా ల్యాబ్ టెస్ట్ రిపోర్టులు ఏవీ పబ్లిక్‌గా లేవ.కాబట్టి కల్తీ జరిగిందనే ఆధారాలు కూడా లేవు.సోషల్ మీడియా రియాక్షన్ వీడియోలు వైరల్ కావడంతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చాయి. చాలామంది దీన్ని మత విద్వేషం రెచ్చగొట్టే కుట్రగా,చిన్న వ్యాపారిని టార్గెట్ చేసి వ్యూస్ కోసం చేసిన అరాచకంగా చూస్తున్నారు.వ్యాపారికి స్థానికులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, రాజకీయ నాయకుల నుంచి మద్దతు వచ్చింది.కొందరు అతని ఊరికి వెళ్లి బిజినెస్‌కు సపోర్ట్ చేసిన వారూ ఉన్నారు.ఇది "మతోన్మాద యూట్యూబ్ ఛానల్" చేసిన తప్పుడు ప్రచారమని తెలుగు యూట్యూబ్ మీడియాలో కొన్ని రిపోర్టులు వచ్చాయి.

**ఈ ఘటనను ఎలా చూడాలి?**

ఇది ఆహార భద్రత గురించిన నిజాయితీపరమైన ఆందోళన కంటే,మత ఆధారంగా విద్వేషం రెచ్చగొట్టే ప్రయత్నంగా కనిపిస్తోంది."ఫుడ్ జిహాద్" అనే టర్మ్ సైంటిఫిక్ లేదా లీగల్ బేసిస్ లేకుండా,ముస్లిం వ్యాపారులను టార్గెట్ చేసే హేట్ స్పీచ్‌గా విమర్శిస్తున్నారు.జాతరలో ఆహార భద్రత ముఖ్యమే కానీ, దాన్ని మత రంగంలోకి లాగి, చిన్న వ్యాపారులను అవమానించడం సరికాదు. అధికారులు ఫుడ్ సేఫ్టీ చెక్ చేసి, నిజమైన సమస్య ఉంటే చర్యలు తీసుకోవాలి.కానీ,మీడియా ట్రయల్స్,పబ్లిక్ హ్యూమిలియేషన్ ద్వారా కాదు.

ఈ ఘటన మతాల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసేలా ఉంది.జాతరలో అందరూ ఒకే కుటుంబంగా జరుపుకునే ఉత్సవంలో ఇలాంటి వివాదాలు దురదృష్టకరం.మేడారం జాతర వంటి పెద్ద గిరిజన ఉత్సవాల్లో భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు (ఆహార భద్రత పేరుతో మత విద్వేషం రెచ్చగొట్టే ఘటనలు) జరగకుండా ఉండాలంటే,బహుముఖ చర్యలు తీసుకోవాలి.ఇవి ప్రభుత్వం,స్థానిక అధికారులు, సమాజం,మీడియా,వ్యాపారులు అందరూ కలిసి చేయాల్సినవి.

**భవిష్యత్ లో ఏం చేయాలి?**

ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) పటిష్ఠంగా అమలు చేసి, జాతరకు ముందే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఫస్సై) లేదా స్థానిక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల బృందాలు తప్పనిసరిగా రాండమ్ చెక్‌లు చేయాలి.అన్ని టెంపరరీ స్టాల్స్‌కు ఫస్సై రిజిస్ట్రేషన్/లైసెన్స్ తప్పనిసరి చేయాలి(చిన్న వ్యాపారులకు సులభమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంది).

ఎక్స్‌పైరీ డేట్,ఇంగ్రెడియంట్స్ లేబులింగ్,హైజీన్ స్టాండర్డ్స్ (హ్యాండ్‌వాష్,గ్లోవ్స్,కవర్) పాటించకపోతే తక్షణం జరిమానా/సీజ్ చేయాలి. జాతరలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ మొబైల్ యూనిట్లు ఏర్పాటు చేసి,ఫిర్యాదులపై తక్షణం టెస్ట్ చేయాలి.మత విద్వేషం రెచ్చగొట్టే ప్రచారాలపై కఠిన చర్యలు ఉండాలి.హేట్ స్పీచ్ మరియు మత ఆధారిత ఆరోపణలు (ఫుడ్ జిహాద్ వంటివి) చట్టవిరుద్ధం.ఐపీసీ సెక్షన్



153ఏ,295ఏ,ఐటీ యాక్ట్ సెక్షన్ 66ఏ (లేదా కొత్త చట్టాలు) కింద కేసులు నమోదు చేయాలి.

యూట్యూబ్,సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లపై కంప్లైంట్ మెకానిజం బలోపేతం చేసి, వీడియోలు వైరల్ అయ్యేముందే రిపోర్ట్ చేసి తొలగించాలి.జాతర సమయంలో సైబర్ సెల్ మరియు పోలీస్ మానిటరింగ్ పెంచి,రియల్-టైమ్‌లో హేట్ కంటెంట్‌ను ట్రాక్ చేయాలి. జాతర నిర్వహణలో జాతర కమిటీ/అధికారులతో వేయాలి. వ్యాపారులకు ప్రీ-ఈవెంట్ ట్రైనింగ్ ఇవ్వాలి.హైజీన్, లేబులింగ్,ధరల నియంత్రణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చెయాలి.సెపరేట్ జోన్లు ఏర్పాటు చేసి,ఆహార స్టాల్స్‌ను సులభంగా గుర్తించగలిగేలా యూనిఫాం బ్యాడ్జ్/నంబరింగ్ చేయాలి. ఫిర్యాదుల కోసం హెల్ప్‌డెస్క్/ కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేసి, అధికారులు తక్షణం స్పందించేలా చూడాలి(పబ్లిక్ ట్రయల్ కాకుండా).మీడియా బాధ్యతగా వ్యవహరించాలి. స్థానిక నాయకులు,గిరిజన సంఘాలు అందరూ ఒకే కుటుంబమని ప్రచారం చేయాలి. జాతర సమయంలో ఇంటర్- ఫెయిత్ హార్మనీ మెసేజ్‌లు పంపాలి.మెయిన్‌స్ట్రీమ్ మీడియా ఫాక్ట్- చెక్ చేసి, సెన్సేషనల్ టైటిల్స్ ఇవ్వకుండా బాధ్యతగా రిపోర్ట్ చేయాలి. పబ్లిక్ అవేర్‌నెస్ క్యాంపెయిన్స్, ఆహార భద్రత గురించి అవగాహన కల్పించి,మత ఆధారిత ఆరోపణలు చేయకుండా హెచ్చరించాలి. చట్టపరమైన/పాలసీ మార్పులు పెద్ద ఉత్సవాలకు స్పెషల్ గైడ్‌లైన్స్ (కుంభ్ మేలా లాంటివి) తయారు చేసి,ఆహార భద్రత మరియు కమ్యూనల్ హార్మనీ రెండింటినీ కవర్ చేయాలి. ఇలాంటి ఘటనలపై స్వతంత్ర ఇన్వెస్టిగేషన్ జరిపి,నిజమైన సమస్యలు ఉంటే చర్యలు తీసుకువాలి.లేకపోతే హేట్ స్ప్రెడ్ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలి.ఈ చర్యలు అమలయితే,ఆహార భద్రత నిజంగా మెరుగుపడుతుంది. అదే సమయంలో మత విద్వేషం రెచ్చగొట్టేందుకు దుర్వినియోగం చేసే అవకాశాలు తగ్గుతాయి. మేడారం జాతర లాంటి ఉత్సవాలు అందరి సామరస్యానికి చిహ్నంగా ఉండాలి,విభేదాలకు కాదు. ప్రభుత్వం,సమాజం కలిసి పనిచేస్తే భవిష్యత్తులో ఇలాంటివి నివారించవచ్చు.

**గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.**

# రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి









**సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్**
**భీమేశ్వర ఆలయంలో పూజలు**
**ఆర్టీసీ ఉచిత రవాణా బస్సు ప్రారంభం**
**రాజన్న ఆలయ విస్తరణ పనులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలన**

**ధర్మఘంట, పిబ్రవరి 14, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వేములవాడకు రాగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో అర్చకులు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ కు స్వస్తితో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని అందజేసి, ఆశీర్వచనం అందించారు.

ఆలయ విస్తరణ పనుల పరిశీలన రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన ఫోటోలు పరిశీలించారు. పనులపై పలు సూచనలు చేశారు.

ఉచిత బస్సు సర్వీసులు ప్రారంభం వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం దాకా భక్తులను ఉచితంగా తరలించే ఆర్టీసీ బస్సులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు. ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులు, ఆర్కిటెక్ట్ మూర్తి, కాంట్రాక్టర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పనివారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. పనుల పురోగతిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సూచించారు. నూతన గోశాల నిర్మాణం, ఇతర అంశాలపై చర్చించారు. ఇప్పుడు ఉన్న గోశాలలో ఎన్ని కోడెలు ఉన్నాయని ఆరా తీశారు. వాటి సంరక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, గుడి చెరువు బండ్ పార్క్ పనులపై సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్ కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఏర్పాటు చేసి వివరించారు. సమావేశంలో ఆర్అండ్ బీ సీఈ రాజేశ్వర్, ఎస్ఈ రాములు ఈఈ నరసింహాచారి, ఆలయ ఈఈ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అక్రిడేషన్ కమిటీలో టీజేఏను చేర్చడం హర్షణీయం





**ఉప్పల లక్ష్మణ్ కృషి,టీజేఏ అధ్యక్షులు**
**రమణారావు పట్టుదల,పోరాట ఫలితమే**
**టీజేఏ సూర్యపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా.**

**ధర్మఘంట ఫిబ్రవరి 14**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ)కు అక్రిడిటేషన్ రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించినందుకు శనివారం టీజేఏ సూర్యపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ఆధ్వర్యంలో హుజూర్ నగర్ టీజేఏ సూర్యాపేట జిల్లా కార్యాలయం నందు కేక్ కట్ చేసి సంబరాలుజరుపుకున్నారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా మాట్లాడుతూ 10 ఏళ్ల టిఆర్ఎస్ పాలనలో టీజేఏ యూనియన్ అక్రిడేషన్ కమిటీలోకి రాకుండా చేశారని 12 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలో టీజేఏ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్ కృషి, టీజేఏ అధ్యక్షులు రమణారావు పట్టుదల,రాజేంద్రనాథ్, గోరి,తెలంగాణ జర్నలిస్టుల అసోసియేషన్ కమిటీ సహకారంతో విజయం సాధించడం హర్షనీయన్నారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, కృషి చేస్తామని జర్నలిస్టులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా కమిటీ కోశాధికారి కొత్తపల్లి మధుసూదన్, జాయింట్ సెక్రెటరీ మక్బుల్ పాషా సభ్యులు కొల్లోజు నాగేంద్ర చారి, భీమపంగు వెంకటేశ్వర్లు, గోరంట్ల శ్రీనివాస్,బయ్యారపు రవీంద్ర,పెందుర్తి సతీష్,దాసరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు





**టెన్త్ పరీక్షలకు సంసిద్ధులు కావాలి**
**మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**ధర్మఘంట, ఫిబ్రవరి 14 మానకొండూర్ :**

ఉన్నత విద్యలో రాణించే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ లోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహం బాలికలతో మాట్లాడారు. విద్యార్థినీ,విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉన్నత విద్య వారధి వంటిదని, విద్యార్థులకు కీలమైన పదో వార్షిక పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఇందుకు విద్యార్థులు చదువుపై దృష్టి సారించి పరీక్షల్లో రాణించాలన్నారు. వార్షిక పరీక్షకు కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, అత్యంత కీలకంగా మారిన ఈ కొద్ది రోజులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు అవగాహనతో ప్రణాళికాబద్ధంగా చదవాల్సిన అవసరం ఉందన్నారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకోవాలని ఆయన సూచించారు. గణితంలో ఎక్కువ మార్కులు సాధించేందుకు అవకాశాలు ఎక్కువన్నారు. అయితే చాలా మంది విద్యార్థులు గణతశాస్త్రమంటేనే బెంబేలెత్తిపోతుంటారని, విద్యార్థులు భయాన్ని వీడి గణితంపై శ్రద్ధ పెట్టాలన్నారు. సూత్రాలతో సాధన చేస్తే గణితంలో ఉత్తీర్ణత సాధించడం కష్టమేమీ కాదని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యార్థులు పదవ తరగతి పరీక్షల కోసం కష్టపడి చదివాలని ఆయన కోరారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధిస్తే నగదు రివార్డుతోపాటు బట్టలు అందజేస్తానని హామీ ఇచ్చారు.

## జర్నలిస్టు కుటుంబానికి బియ్యం అందజేస్తున్న డబ్ల్యూ జె ఐ మండల ప్రెస్ క్లబ్ సభ్యులు



**ధర్మఘంట ఫిబ్రవరి 14 మానకొండూర్,** జర్నలిస్టు కుటుంబానికి ప్రెస్ క్లబ్ సభ్యుల పరామర్శబియ్యం అందజేత గన్నేరువరం: మండలంలోని చీమలకుంట పల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు విభూది వీరకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని డబ్ల్యూ జె ఐ మండలం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల ప్రెస్ క్లబ్ సభ్యులు శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పాశం ఎల్లయ్య, ఓరగంటి సంపత్, పులి సంతోష్ గౌడ్, భీమనాది వెంకటేష్, వడ్నాల తిరుపతి, జాలి నరేష్ రెడ్డి, నేరెళ్ల నరేష్ గౌడ్ గ్రామ సర్పంచ్ జంగిటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏదులాపురం చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలి..

**అధిక సీట్లు.. ఎక్కువ ఓట్లు కలిగి ఉన్నవి మాదిగలవే..**
**విలేకరుల సమావేశంలో**
**ఎం ఆర్ పి ఎస్ జిల్లా కార్యదర్శి కనకం జనార్ధన్ మాదిగ విజ్ఞప్తి...**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 14 ధర్మ ఘంట**

ఏదులాపురం చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వు చేయబడిందని, ఏదులాపురం మున్సిపల్ ఎన్నికలలో ఎస్సీ మాదిగలు నాలుగు సీట్లు గెలుచుకున్నారని, ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు సభ్యులు గెలుపొందారని అధిక స్థానాలు దక్కించుకున్న మాదిగలకు చైర్మన్ పదవి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ , ఎం ఎస్ పి జిల్లా కార్యదర్శి, ఖమ్మం రూరల్ మండల ఇన్చార్జి కనకం జనార్ధన్ మాదిగ కోరారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏదులాపురం మున్సిపాలిటీలోనూ, పాలేరు నియోజకవర్గంలోనూ జిల్లా లోను అటు రాష్ట్రంలోనూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓటు బ్యాంకింగ్ జనాభా అత్యధికంగా ఉందని, రిజర్వేషన్ల ప్రాతిపదికన తమ సామాజిక వర్గానికి ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ పదవి దక్కే అవకాశం ఉందని, కానీ జరుగుతున్న పరిణామాలు అందుకు భిన్నంగా ఆందోళనకరంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.




ఎన్నికలలో ఎక్కువ స్థానాలు మాదిగ సామాజిక వర్గానికి చెందినవారు గెలుపొందారని అటువంటి వారికి కాదని మరొకరికి కట్ట పెట్టాలనే ప్రయత్నాలు మంచిది కాదని అన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మాదిగ సామాజిక వర్గం అక్కున చేర్చుకొని అండదండగా నిల్చారని, ఏ ఎన్నిక వచ్చిన, పార్టీకి ఎంత కష్టం వచ్చినా దశాబ్దాల తరబడి వెన్నంటే నిలిచారని అటువంటివారిని కాదని మరొక సామాజిక వర్గానికి ఇవ్వాలనే ప్రయత్నాలు మంచి పరిణామం కాదని అన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకొని న్యాయబద్ధంగా మాదిగలకు దక్కే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్ల లోను, ఓటు బ్యాంకింగ్ లోను, జనాభా లోను మున్సిపల్ ఎన్నికల్లో అధిక స్థానాలు మాదిగ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులే విజయం సాధించారని అటువంటి వారికే చైర్మన్ పదవి కేటాయించాలని కోరారు.

ఈ సందర్భంగా ఎస్సీ ఉపకులం దక్కల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్నే రామారావు మాట్లాడుతూ.. ఏదులాపురం మున్సిపాలిటీ అదేవిధంగా పాలేరు నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు రిజర్వేషన్ల ప్రాతిపదికన మాదిగలకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దయతో ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# పురపోరులో 'పొంగులేటి' మ్యాజిక్..

**10 రోజుల్లో.. 249 వార్డుల్లో ప్రచారం..**
**70 శాతం సక్సెస్ రేటుతో 174 వార్డుల్లో గెలుపు..**
**శీనన్న వ్యూహంతో ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ పురపాలికల్లో హస్తం ప్రభంజనం..**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 14 ధర్మ ఘంట**

ఖమ్మం : మున్సిపల్ ఎన్నికల కురుక్షేత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి (శీనన్న) ఒక అజేయ శక్తిగా నిలిచారు. ముఖ్యమంత్రి రేవంతన్న అప్పగించిన బాధ్యతను సవాలుగా తీసుకున్న ఆయన, తన వ్యూహ చతురతతో ఫలితాలను తలకిందులు చేశారు. కేవలం అంకెలే కాదు.. ఆ అంకెల వెనుక ఉన్న ఆయన కష్టం, ప్రచారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం 10 రోజుల్లోనే అసాధ్యమనుకున్న సమీకరణాలను సుసాధ్యం చేసి చూపారు.

**ఉమ్మడి ఖమ్మం జిల్లా : శీనన్న అడ్డాలో తిరుగులేని హవా..**

తన సొంత గడ్డపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గాలివాటం కాదు.. సునామీ సృష్టించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆయన అడుగుపెట్టిన ప్రతిచోటా కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది.ఏదులాపురం : 32 వార్డుల్లో ఏకంగా 24 చోట్ల జయకేతనం ఎగురవేసి సత్తా చాటారు.కొత్తగూడెం కార్పొరేషన్ : సింగరేణి హృదయంలో



22 స్థానాలను కైవసం చేసుకున్నారు.కల్లూరు & సత్తుపల్లి: కల్లూరులో 12, సత్తుపల్లిలో 17 వార్డులను హస్తం ఖాతాలో వేశారు.ఇల్లందు&అశ్వారావుపేట : ఇక్కడ కూడా ఇల్లందులో 19, అశ్వారావుపేటలో 17 స్థానాల్లో గెలిచి తన పట్టును నిరూపించుకున్నారు.

**ఓరుగల్లు కోటపై హస్తం జైత్రయాత్ర...**

రేవంతన్న ఆశీస్సులతో ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యతలను స్వీకరించిన శీనన్న, అక్కడ కూడా ప్రత్యర్థుల కోటలను బద్ధలు కొట్టారు.**భూపాలపల్లి** : అత్యంత కీలకమైన ఈ మున్సిపాలిటీలో 16 వార్డులను గెలుచుకుని పట్టు సాధించారు. పరకాల & స్టేషన్ ఘన్‌పూర్ : పరకాలలో 13, స్టేషన్ ఘన్‌పూర్‌లో 13 స్థానాలను గెలిపించి జిల్లాలో కాంగ్రెస్ ప్రాభవాన్ని చాటారు.

**గణాంకాలే సాక్ష్యం : 249 వార్డుల ప్రచారం.. 174 స్థానాల్లో విజయం!**

మొత్తంగా మంత్రి పొంగులేటి ప్రచారం నిర్వహించిన 249 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ 174 స్థానాలను గెలుచుకుంది. అంటే సుమారు 70 శాతం గెలుపు రేటుతో ఆయన 'మోస్ట్ సక్సెస్‌ఫుల్' లీడర్‌గా నిలిచారు. పగలు రేయి ఏకంచేసి ఆయన సాగించిన సుడిగాలి పర్యటనలు, రేవంతన్న సంక్షేమ పథకాలపై ప్రజలకు కల్పించిన భరోసా ఓట్ల వర్షంగా కురిసింది. మాట ఇస్తే తప్పని నైజంతో, అభివృద్ధిపై ఉన్న నిబద్ధతతో శీనన్న ప్రజాప్రభుత్వంలో తన మార్క్ రాజకీయాలను మరోసారి చాటిచెప్పారు.

# చిన్న పత్రికలపై చిన్న చూపు తగదు..

**ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి..**
**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్..**
**17న"ఛలో సమాచార భవన్"కు పిలుపు..**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 14 ధర్మ ఘంట**


హైదరాబాద్ :కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు ఎంప్యానల్‌మెంట్ తో సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీన "ఛలో సమాచార భవన్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార పౌరసంబధాల కమిషనర్ కార్యాలయం(సమాచారభవన్) ఎదుట జరిగే జర్నలిస్టుల నిరసన కార్యక్రమంలో వివిధ పత్రికల నిర్వాహకులు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు, చానళ్ళకు మాత్రమే ఇస్తూ మిగతా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పద్ధతిని తుంగలో తోక్కి పత్రికలకు ఎంప్యానల్ ముసుగు తొడిగి, నిబంధనల పేరుతో చిన్న,మధ్య తరహా పత్రికలను పాతాళానికి తొక్కారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ స్వరాష్ట్రంలోనే చిన్న మధ్య తరహా పత్రికలకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగుతుందని మామిడి సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వం జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై ఆనాడు గొంతెత్తిన ఈనాటి పాలకులు అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా...అనేక పత్రికలను ఎంపానల్మెంట్ చేయకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారనని ఆయన ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులందరికీ సరైన న్యాయం చేస్తామని నమ్మబలికిన పాలకులు మీడియా అక్రిడిటేషన్ ల విషయంలోనే వివక్ష చూపుతూ చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీసం అక్రెడిటేషన్లు ఇవ్వకుండా అణిచివేస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎంప్యానల్ లిస్టులో ఉన్న చాలా పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించి జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సందర్భాన్ని బట్టి దరఖాస్తు చేసుకుంటే అడ్వర్టయిజ్మెంట్ తో పాటు అక్రెడిటేషన్ ఇచ్చే వారని, ప్రస్తుతం అడ్వర్టయిజ్మెంట్ల సంగతి దేవుడెరుగు గానీ...కనీసం అక్రెడిటేషన్ కార్డు ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ వివక్ష కారణంగా స్వరాష్ట్రంలో చిన్న పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, దీని వల్ల ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులకు పత్రికల నిర్వహణ భారమవుతుందని అన్నారు. దీనికి తోడు మూలిగే నక్కమీద తాటికాయపడ్డట్టు ఎంప్యానల్‌లో ఉన్న పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించడం చాలా భాదాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న ప్రతి పత్రికకు అక్రిడిటేషన్ కార్డులు గతంలో మాదిరిగా ఇవ్వాలని మామిడి



సోమయ్య డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆయా పత్రికలకు ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్మెంట్ ఇవ్వాలని, ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై అవగాహన

**ధర్మ ఘంట ఫిబ్రవరి 14,కడ్తాల్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫలక్ నుమా హైదరాబాద్ వారు ఎన్ఎస్ఎస్ క్యాంప్ లో భాగంగా శనివారం 5వ రోజు కడ్తాల్ మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ క్రైమ్ వంటి అంశాల మీద కడ్తాల్ స్థానిక పోలీస్ ల మరియు ట్రాఫిక్ పోలీస్ ల ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తూ ప్రజల సహకారంతోనే ట్రాఫిక్ ప్రమాదాలు, సైబర్ నేరాలు తగ్గుతాయని, ఓటీపీ, బ్యాంక్ వివరాలు, తెలియని లింకులు ఎవరికీ ఇవ్వకూడదని, ఏ అనుమానాస్పద కార్యకలాపం జరిగిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని,మద్యం సేవించి డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి ప్రమాదకర చర్యలు



తప్పించాలని పోలీసులు తెలిపారు. అనంతరం కడ్తాల్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి,అనంతరం పోలీస్ స్టేషన్ సందర్శించి ఎస్సై వర శివప్రసాద్ ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిటీ



1,2,3 ప్రోగ్రాం ఆఫీసర్స్ డా. బాబు రావు, డా. శశికళ, డా. సరిత రాణి, హెడ్ కానిస్టేబుల్ రాములు, ట్రాఫిక్ పోలీస్ ఇంచార్జ్ బీమా రాజు, కానిస్టేబుల్స్ ,విద్యార్థులు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్య నేర్పాల్సింది పోయి..పిచ్చి చేష్టలా..? సంస్కారం లేని 'మాస్టర్' సస్పెండ్..!




**ధర్మ ఘంట,ఫిబ్రవరి 14 మర్రిగూడ :**

విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన ఒక ఉపాధ్యాయుడు తన బాధ్యతను మరిచి,అసభ్యకరంగా ప్రవర్తించి వివాహేతర సంబంధం వ్యామోహంలో పడి,ఒక వ్యక్తి ప్రాణం పోవడానికి కారకుడైన ఘటన మర్రిగూడ మండలంలో సంచలనం సృష్టించింది.నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం వెంకేపల్లి తండాలో జరిగిన విషాదం పాఠకులకు తెలిసిందే.భార్య ప్రవర్తనతో ఉపాధ్యాయుడితో ఉన్న వివాహేతర సంబంధం కారణంగా మనస్థాపం చెందిన జటావత్ బాలాజీ బలవన్మరణానికి పాల్పడ్డారు.బాలాజీ మృతికి హతిరాం ప్రవర్తనే ప్రధాన కారణమని కుటుంబ సభ్యులు,గ్రామస్థులు ఆరోపించారు.ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఎంఈఓ చంప్లా నాయక్ విచారణ అనంతరం ఉపాధ్యాయుడిపై క్రమశిక్షణా చర్యలు చేపట్టారు.ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘించి,ఒక వ్యక్తి మరణానికి కారణమైనందుకు హతిరాంను సస్పెండ్ చేస్తూ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.కుటుంబ గౌరవాన్ని,వృత్తి మర్యాదను మంటగలిపే ఇలాంటి ఘటనలు సమాజానికి చేటు.ఇలాంటి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందే స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

## ఓటర్ మహాశయులకు కృతజ్ఞతలు..

**బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అప్పం సురేష్**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 14 ధర్మ ఘంట వైరా**



వైరా మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ వామపక్షాల కూటమికి తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్క ఓటర్ మహాసే యులకు పేరుపేరునా వైరా పట్టణ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు అప్పం సురేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.. వైరా మున్సిపాలిటీలో కనీవినీ ఎరగని విధంగా వామపక్ష పార్టీల అభ్యర్థులకు ఏడు స్థానాలకు పట్టం కట్టిన ఓటర్లకు ప్రత్యేక ధన్యవా దాలు తెలుపుతూ టిఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని ఏ సమస్య ఉన్న తమ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.. ఇదే ప్రోత్సాహాన్ని ముందు ముందు కొనసాగించాలని కోరారు.

## వైరా ఇందిరమ్మ కాలనీ వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయండి..

**ఎమ్మెల్యే రామ్ దాస్ నాయక్**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 14 ధర్మ ఘంట వైరా**



వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ 9వ వార్డు వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ కట్ల సంతోష్ విజ్ఞప్తి మేరకు స్పందించిన రాందాస్ నాయక్ అధికారులను ఆదేశించారు, కట్ల సంతోష్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తో మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఇందిరమ్మ కాలనీ ప్రజలు వైరా మధిర రోడ్ లోని మార్కెట్ యార్డ్ సమీపంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద ఆర్టీసీ బస్టాప్ లేకుండా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే అధికారులు ఆదేశించారు.

## అవినీతి రహిత పురపాలక సంఘంగా తీర్చి దిద్దండి

**సూర్యాపేట పట్టణాభివృద్ధికి అవిరళ కృషి చేస్తా**
**రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ధర్మఘంట ఫిబ్రవరి 14 హైదరాబాద్:**

సూర్యాపేట పురపాలక సంఘాన్ని అవినీతి రహిత పురపాలక సంఘంగా తీర్చి దిద్దాలని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.గతంలో సూర్యాపేట పురపాలక సంఘంలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలు పునరావృతం కాకుండా నూతన పాలక మండలి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నూతనంగా ఎన్నికయిన సూర్యాపేట పురపాలక సంఘం ప్రతినిధులు శనివారం సాయంత్రం హైదరాబాద్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.48 వార్డులకు గాను 31 స్థానాలలో విజయం సాధించిన కౌన్సిలర్లను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి మీద ఉన్న సూర్యాపేట పట్టణం ఇప్పటివరకు ఊహించిన మేరకు అభివృద్ధి సాధించలేకపోయిందన్నారు.పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ మీద చూపిన ఆదరణ అనన్య సామాన్యమైనదని, ప్రజలు మనమీద అపారమైన నమ్మకంతో గురుతర బాధ్యత మోపారని,వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు పని చేయాలని ఉపదేశించారు. జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిగా సూర్యాపేట పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు.ఎప్పటికప్పుడు పట్టణాభివృద్ధిపై సమీక్షించుకుని ప్రత్యేక ప్రణాళికలు రూపొందించేందుకు కార్యాచరణ పథకాన్ని రూపొందించుకుందామన్నారు.అందుకు సరిపడా నిధులు తెచ్చి సూర్యాపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,ఏఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి,సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,పిసిసి కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావులతో పాటు నూతనంగా ఎన్నికయిన కౌన్సిలర్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.



ధర్మఘంట

# నైతిక విజయం బీ.ఆర్.ఎస్ పార్టీ దే...

మక్కాన్ సింగ్ దౌర్జన్య దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓటు వేశారు.
ఎమ్మెల్యే అరాచక పాలనకు మా అభ్యర్థుల విజయమే నిదర్శనం.
రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్.

**ధర్మఘంట,ఫిబ్రవరి14,రామగుండం:**




రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ దౌర్జన్యాలు, కాంగ్రెస్ దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓటేశారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఓడిన తమ బీఆర్ఎస్ అభ్యర్థులు కూడా తక్కువ ఓట్ల తేడాతోనే ఓడిపోయారని తెలిపారు. రామగుండం రాజకీయాల్లో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదని, అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలను బెదిరించడం, ప్రజలను ప్రచారానికి రాకుండా అడ్డుకోవడం, అధికార దుర్వినియోగం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు కల్పించినా ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా గొప్ప తీర్పునిచ్చారని పేర్కొన్నారు. ఓటమి పాలైనప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థులు కష్టపడిన తీరు, అధికార పార్టీపై చేసిన పోరాటం అభినందనీయమని ప్రశంసించారు. ఇది నైతికంగా బీఆర్ఎస్ పార్టీ విజయం, ప్రజల విజయమని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే అరాచక పాలనకు తమ అభ్యర్థుల విజయం నిదర్శనమని అన్నారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకత్వం అందరికీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థులను సత్కరించారు. రామగుండం కార్పోరేషన్ ఎన్నికల్లో బీ.ఆర్.ఎస్ పార్టీ కి ఓటు వేసిన ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేఖరుల సమావేశంలో బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాలుగోన్నారు.

# రాజ్యాధికారం కోసం మాదిగలు సంఘటితం కావాలి










**మాజీ మంత్రి మోత్కులపల్లి నర్సింహులు**

**ధర్మఘంట ఫిబ్రవరి 14 కరీంనగర్:** రాజ్యాధికారం కోసం మాదిగలు చైతన్యవంతులై సంఘటిత శక్తిగా ఎదగాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ లోని ప్రతిమ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో మాదిగ మేధావుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెపల్లి రాజేందర్ అధ్యక్షతన జరిగిన మాదిగ మహాశక్తి ఆత్మీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయాల పార్టీలను ఎంఐఎం పార్టీ నేత అసవుద్దీన్ ఒవైసీ శాసిస్తుండా, 12 శాతం జనాభా కలిగిన మాదిగలు వారి తరహాలోనే ప్రభుత్వాలను,రాజకీయ పార్టీలను శాసించాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగలల్లో ఐక్యతను సాధించినప్పుడు ఇది సాకారమవుతుందన్నారు. అందుకే మాదిగల్లో ఐక్యతను పెంపొందించాలనే మహత్తర ఉద్దేశంతోనే మాదిగల మహాశక్తి ఆత్మయ సభలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 50వేల వరకు ఉన్న ఎస్సీలంతా గంపగుత్తగా మనకే ఓట్లేసే స్థితికి రావాలన్నారు. మాదిగ దండోరా ఉద్యమంలో ఎంతో మంది మాదిగలు అమరులయ్యారని వివరించారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో వారి పాత్ర మరువలేనిదని కొనియాడారు. అమరుల స్తూపం, కోటి రూపాయలు, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారని తెలిపారు. రాష్ట్రంలో అరకోటికి పైగా జనాభా ఉన్న మాదిగలు ఓట్లకే పరిమితమవుతూ అనాధలుగా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం లేకపోవడమే మన జాతి వెనుకబాటు తనానికి కారాణమని పేర్కొన్నారు

**అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి : డాక్టర్ కవ్వంపల్లి**

టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీలకు ఇచ్చిన అసైన్డ్ భూములపై పూర్తిస్థాయిలో హక్కులు కల్పిస్తూ వారికే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మూతపడ్డ లెదర్ పార్కులను తెరిపించడమే కాకుండా ఇంకా ఏర్పాటు చేయలేని లెదర్ పార్క్ ను ప్రారంభించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కొన్నిచోట్ల లెదర్ పార్క్ స్థలాలను లీజుకు ఇచ్చారని, వాటి లీజులు రద్దు చేసి పార్కులను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

మాదిగలు ఏకం కావాలి : మాజీ ఎంపీ పసునూరి

వరంగల్ మాజీ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ మాదిగలను ఏకతాటి పైకి తీసుకురావడమే కాకుండా మన ఓట్ల మన జాతి బిడ్డలకే ఓట్ల వేయడం ద్వారా రాజ్యాధికారాన్ని పొందాలన్నదే మాదిగ మహాశక్తి ఆత్మీయ సదస్సుల ఉద్దేశమన్నారు. దీనిని ఒక రాజకీయ శక్తిగా రూపకల్పన చేయడం జరిగిందని అనేక సంవత్సరాలుగా విడిపోయిన మాదిగల అందరిని ఒక తాటిపైకి తీసుకువచ్చి ఈ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామన్నారు.

ఈ సదస్సులో ప్రొఫెసర్ కనుకయ్య, ఎం విజయ్ కుమార్, గజ్జెల స్వామి, పల్లెల వీరస్వామి, డాక్టర్ కె.శ్రీనివాస, బొంకూరు శంకర్, ఎం. దేవేందర్, బండా శ్రీనివాస్ తోపాటు మేధావులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, మాదిగల సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

# మన్నేపల్లి వెంకటేశ్వరరావు వర్ధంతి సభ ..

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 14 ధర్మ ఘంట**






తల్లాడ మండలం కేశవపురం గ్రామంలో శుక్రవారం రాత్రి మన్నేపల్లి వెంకటేశ్వరరావు 25వ వర్ధంతి సందర్భంగా నూతనంగా ఏర్పాటు స్థూపాన్ని ఆవిష్కరించారు.

ఆ గ్రామంలో వివిధ సందర్భాల్లో మరణించిన ఉద్యమ వీరుల స్థూపాల వద్ద జండాలు ఎగరవేసి అనంతరం సభ నిర్వహించారు ఈ సభ మన్నేపల్లి రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ వర్ధంతి సభలో ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు పాల్గొని మాట్లాడుతూ మరణించి 25 సంవత్సరాలు గడిచిన ఆయన చేసిన సేవలు మరువలేనివని నాడు వ్యవసాయ కార్మిక సంఘం లో పనిచేస్తూ ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కూలిపోరాటాలపై పనిచేశారని కుటుంబం అందించిన వారసత్వాన్ని తన కుటుంబ సభ్యులకు ఇప్పటికీ ఎర్రజెండా అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని కమ్యూనిస్టులో ఓట్లు సీట్లు కోసం కాకుండా పేద ప్రజల ఎజెండా కోసం పనిచేస్తారని అన్నారు దేశంలో మతోన్మాద శక్తులు కార్పోరేట్ శక్తులు పరిపాలన చేస్తున్న పేదలకు తాత్కాలిక ప్రయోజనాలు ఎరచూపి ఓట్లుగా మలుచుకుని అధికారాన్ని కొనసాగిస్తున్నాయని అందుకు భిన్నంగా అందుకు భిన్నంగా కేరళ ప్రభుత్వం ఎర్ర జెండా ప్రభుత్వం సమ సమాజ నిర్మాణం కోసం పేదరిక నిర్మూలన కోసం పనిచేసి ఇటీవల కాలంలో దేశంలోనే అత్యంత పేదలు లేని రాష్ట్రంగా సగర్వంగా ప్రకటించిందని గుర్తు చేశారు మన పక్కనే ఉన్న చైనా దేశం పేదలు లేని దేశంగా ప్రకటించిందని ధనక దేశం అయినా అమెరికా ప్రభుత్వం ఆ ధైర్యం చేయలేక సామ్రాజ్యవాద లక్ష్యంతో ఇతర దేశాలపై దాడులకు దిగుతుందని ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పనిచేస్తుందని అన్నారు వ్యవసాయాన్ని కార్పోరేట్లకు కట్టబెట్టే విధంగా ప్రభుత్వం ఉందని ప్రైవేటీకరణ దిశగా పనిచేస్తుందని వ్యవసాయానికి విద్యుత్తు ప్రైవేటీకరిస్తుందని వ్యవసాయానికి బడ్జెట్లో కేటాయింపులు తగ్గించి రసాయనిక ఎరువులను రైతులకు అందకుండా చేస్తుందని వ్యవసాయ ఉత్పత్తులను అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటుందని తద్వారా వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని అన్నారు కార్మికులకు 44 చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి 12 గంటల పని విధానం తీసుకువస్తుందని వ్యవసాయ కూలీలకు విబిజి రాంజీ బిల్లును ప్రవేశపెట్టి కూలీలకు పని లేకుండా పట్టణ ప్రాంతాల్లో ఉన్న కార్పోరేట్ కంపెనీలకు బానిసలను చేసే కుట్ర కేంద్ర ప్రభుత్వం చేస్తుందని అన్నారు ఇటీవల కాలంలో మహారాష్ట్ర రైతులు సాగించిన మహత్తర పోరాటంలో ప్రభుత్వం వెనక్కి తగ్గి రైతులు ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లను అంగీకరిస్తూ రాతపూర్వక హామీ ఇచ్చిందని గుర్తు చేశారు ప్రస్తుతం ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ ప్రజలను చైతన్యం చేసి ఉద్యమాలను నిర్మించి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే మన్నేపల్లి వెంకటేశ్వరరావు గారికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి బొంతు రాంబాబు డివిజన్ కార్యదర్శి సేలం సత్యనారాయణ రెడ్డి సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర రావు సత్తెనపల్లి నరేష్ షేక్ నన్నేసాహెబ్ చల్లా నాగేశ్వరరావు పాటిబండ్ల సత్యనారాయణ మన్నేపల్లి అర్జున్ రావు మన్నేపల్లి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## వైరా మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన.. నూతన కౌన్సిలర్లను సన్మానించిన మాజీ మంత్రి పువ్వాడ..



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 14 వైరా ధర్మ ఘంట**

వైరా మున్సిపాలిటీకీ జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్,సిపిఎం,సిపిఐ కౌన్సిల్లర్లకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మం తన క్యాంప్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు కట్టా స్వరూప రాణి, తిరుపతి శివ కుమారి,చిలక చిన్న కోటయ్య,కిన్నెర కృష్ణ, దొంతెబోయిన వెంకటేశ్వర్లు,మాదినేని సునీత,నల్లమోతు శైలజ లను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు.అనంతరం పువ్వాడ అజయ్ కుమార్ గారు మాట్లాడుతూ బిఆర్ఎస్ మిత్రపక్షాలు కలిసి పొత్తులతో అధికార పార్టీకీ ఎదురోడ్డి పోరాడి విజయం సాధించామని ప్రజలు ఒకసారి పాలించే పాత్ర ఒకసారి ప్రతిపక్ష పాత్రను ఇస్తారని ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష పాత్రతో కౌన్సిల్ లో ప్రజలు తరపున పోరాడాలని అన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో వైరా మున్సిపాలిటీలో కాంగ్రెస్ కి ఎదురులేదు అన్న వాళ్ళకి మనము గట్టిగా దీటుగా పోటీ ఇచ్చామని నేను బాధ్యత తీసుకున్న అని తెలిసి అధికార పార్టీ ఎన్ని ఎత్తులు వేసిన మన బీఆర్ఎస్ అభ్యర్థులు వెనకాడకుండా ఎదురు పోరాడన్నారు.రాష్ట్రంలో చాలా చోట్ల హంగ్ ఏర్పడిందని బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక స్థానాలు సాధించామని కొత్తగూడెం కార్పొరేషన్ కూడా హంగ్ రావడం వలన సింగరేణి బొగ్గు కుంబకోణానికి వ్యతిరేకంగా కమ్యూనిస్ట్ పార్టీ మద్దతు తెలిపామని అన్నారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, జిల్లా నాయకులు మంజుల మదనలాల్, లకావత్ గిరిబాబు,మాజీ ఎంపిపి కృష్ణార్జునరావు,సీనియర్ నాయకులు విశ్వేశ్వర్రావు, వైరా మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు,టౌన్ అధ్యక్షుడు సురేష్,సిపిఎం కార్యదర్శి భూక్యా వీరభద్రం,సిపిఐ కార్యదర్శి ఎర్రా బాబు, నాయకులు నాగభూషణం, కొత్త వెంకటేశ్వర్లు, సుధీర్,కిరణ్,ప్రసాద్, దొండపాటి రమేష్,బోసు, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## బదిలి వర్కర్లకు మార్చి 2026 నుంచి జనరల్ అసిస్టెంట్ ట్రైనీ గా అపాయింట్మెంట్ ఆర్డర్.

**ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ వెల్లడి.**

**ధర్మఘంట,ఫిబ్రవరి14,రామగుండం:**



సింగరేణిలో పని చేస్తున్న బదిలీ వర్కర్ లకు మార్చి 2026 నుంచి జనరల్ అసిస్టెంట్ ట్రైనీ గా అపాయింట్మెంట్ ఆర్డర్ లు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందని గుర్తింపు సంఘం ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి లో బదిలీ వర్కర్ నుంచి జనరల్ అసిస్టెంట్ గా మారాలంటే గతంలో కనీసం మూడు సంవత్సరాల సమయం పట్టెదని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను గుర్తింపు సంఘం ఏఐటియుసి యాజమాన్యం తో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో మాట్లాడి ఒప్పించి మార్చి 2026 నుండి బదిలి వర్కర్ కు బదులు గా జనరల్ అసిస్టెంట్ ట్రైనీ గా అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చే విధంగా ఒప్పించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం బదిలీ వర్కర్లు గా పనిచేస్తున్న వారిని మరియు భవిష్యత్తులో రిక్రూట్మెంట్ అయ్యేవారికి కూడా జనరల్ అసిస్టెంట్ ట్రైనిగా ఇస్తారని ఆయన తెలిపారు. 190/240 మస్టర్లు పూర్తి కాగానే ట్రైని తీసేసి జనరల్ అసిస్టెంట్ గా మారుస్తారని ఆయన పేర్కొన్నారు. కనుక బదిలీ వర్కర్లు అందరూ ఏఐటీయుసి కృషిని గమనించగలరని ఆయన పేర్కొన్నారు.

## ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలి...







విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులసమావేశంలో రైతు సంఘం నాయకులు సత్యనారాయణ రెడ్డి.

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 14 ధర్మ ఘంట తల్లాడ**

తల్లాడ దొడ్డ కృష్ణయ్య భవనంలో విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికుల డివిజన్ స్థాయి సమావేశం రాజారావు అధ్యక్షతన జరిగినది. దీనిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ జిల్లా అధ్యక్షులు ఉపేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు అందరూ ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకొని తమకు రావలసిన వేతనాలు పొందాలని ఈ సందర్భంగా తెలియపరిచిన విద్యుత్ శాఖలో కిందిస్థాయి ఉద్యోగులైన మీటర్ రీడర్ , లు బిల్ కలెక్టర్లు అన్ మేన్ కార్మికులు , కనీస వేతనాలు లేవని ఏళ్ల తరబడి పనిచేస్తున్న గాని యాజమాన్యం ప్రభుత్వం గుర్తించడం లేదని అధికారాంలోకి వచ్చిన ప్రభుత్వం వెంటనే వీరి గురించి చర్య తీసుకోవాలని రాబోయే రోజులలో దీనికోసం పెద్ద ఎత్తైన ఆందోళన చేయాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం వారు డివిజన్ కమిటీని ఎన్నుకొన్నారు. గౌరవ అధ్యక్షులుగా అశోక్, డివిజన్ అధ్యక్షులుగా రాజారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామకృష్ణ ,కార్యదర్శులు . డి.సురేష్ ఉపాధ్యక్షులుగా ఎస్. వంశీ, ఎస్ .రాము సహాయ కార్యదర్శులుగా హరి,నరేష్ , కోశాధికారిగా రాజేష్ ఎన్నుకున్నారు.

